


అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

29.07.2026
బుధవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 29
పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# అత్యంత నీచమైన వ్యక్తి

## కొత్త విద్యాశాఖ మంత్రిపై రాహుల్ గాంధీ ఫైర్

## ప్రధాని మోడీపై కూడా విమర్శలు



**న్యూఢిల్లీ, జులై 28, అనంతజనశక్తి న్యూస్**

నూతన కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. 'అత్యంత నీచమైన వ్యక్తి' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా నియమించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు.. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రధాని మోడీ ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించిన నిర్ణయాన్ని ప్రశ్నించారు.

2లో..

# ప్రేయసిని బైక్‌పై ఈడ్చుకెళ్లిన ప్రియుడు

- పెళ్లి చేసుకోమన్నందుకు ఘాతుకం
- బీహార్‌లో దారుణ ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

**పాట్నా, జులై 28, అనంత జనశక్తి న్యూస్**
బీహార్‌లోని నలందా జిల్లాలో దారుణం జరిగింది. పెళ్లి చేసుకోమన్న పాపానికి ఓ ప్రియుడి అమానుషంగా ప్రవర్తించాడు. బైక్‌పై 100 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లిపోయాడు. ఈ దారుణ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

2లో..



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు

# శాశ్వత పరిష్కారం

- యూపీఎస్సీ తరహాలో పారదర్శకంగా టీజీపీఎస్సీ
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో
- సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- 11.56 లక్షల ఇళ్ల కేటాయింపుపై విజ్ఞప్తి
- ఉపాధి హామీ పథకంలో కొత్త పనుల ప్రతిపాదన
- ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి హామీ అనుసంధానం
- ఏపీలో రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలపై ప్రశ్న

5లో..



**న్యూఢిల్లీ, జులై 28, అనంతజనశక్తి న్యూస్**

కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమ అంశాలపై చర్చించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) 2.0 పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని, దీనివల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకమైన వీబీజీ రామ్‌జీ జాబితాలో మరికొన్ని అదనపు పనులను చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం కోరారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతుల జీవనోపాధిని దెబ్బతినకుండా కాపాడేందుకు 10 కొత్త రకాల పనులను ఉపాధి హామీ కింద నిర్వహించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా కూరగాయల పందిళ్ల నిర్మాణం, పశు గ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటల పెంపకం, పట్టుపురుగుల షెడ్ల ఏర్పాటు వంటి వ్యవసాయ అనుబంధ పనులకు ఆమోదం తెలపాలని ప్రతిపాదించారు.

## వారసత్వ భూములకు

# ఆటో మ్యుటేషన్

- రెవెన్యూ రికార్డుల్లో తక్షణ నమోదు
- కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలకు చెక్
- భూ పరిపాలనలో పెరగనున్న పారదర్శకత
- రూ.10 లక్షల లోపు భూములకు స్టాంప్ డ్యూటీ రూ.100 మాత్రమే
- విల్ లేకపోతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తప్పనిసరి
- అసలైన వారసుల గుర్తింపు మరింత సులభం

2లో..

**అమరావతి,, జులై 28, అనంతజనశక్తి న్యూస్**
వారసత్వ భూముల బదలాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు చేయనుంది. దీంతో భూముల రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు నమోదు కానున్నాయి. ఇప్పటివరకు వారసత్వ భూముల మ్యుటేషన్ కోసం ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దరఖాస్తులు, పరిశీలనలు, అనుమతుల ప్రక్రియ కారణంగా ఆలస్యం జరిగేది. కొత్త విధానంతో ఈ ఇబ్బందులకు చెక్ పడనుంది.



# ప్రధాని మోడీ ఇన్‌స్టాకు క్రేజ్

- 10.5 కోట్లు దాటిన ఫాలోవర్స్
- వారం వ్యవధిలోనే కొత్తగా 4 మిలియన్ల మంది
- ఇటీవల రెండు వీడియోలు వైరల్
- కావడంతో పెరిగిన ఫాలోవర్లు

2లో..

## అవకాశాలు సద్వినియోగం

# చేసుకోండి


- యువతకు నారా భువనేశ్వరి పిలుపు
- కుప్పం పర్యటనలో భాగంగా కామెంట్
- ఆలోచనలతో నిర్ణయాలు తీసుకోవాలి
- విద్యార్థులతో నారా భువనేశ్వరి సమావేశం



2లో..

# వైసీపీపై మంత్రి లోకేశ్ ఫైర్

- అంగన్వాడీల పేరుతో విషప్రచారం
- గత ప్రభుత్వ హయాంలోనే..
- అమ్మ ఒడి పథకం అందలేదు
- కూటమి ప్రభుత్వం వచ్చాకే అమలు



2లో..

**అమరావతి, జులై 28, అనంతజనశక్తి న్యూస్**

అంగన్వాడీల విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసీపీ నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 'ఫేక్ వర్సెస్ రియల్' పేరుతో వీడియోను విడుదల చేశారు.

## ప్రధాని కోసం ధర్మేంద్ర తొలగించారు

- ప్రధాన్‌ను తొలగించారు
- అఖిలేష్ సంచలన వ్యాఖ్యలు

2లో..



# తీరం దాటిన తీవ్ర వాయుగుండం

## ఉత్తరాంధ్రలో మోస్తరు వర్షాలు!

## భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడి

**అమరావతి, జులై 28, అనంత జనశక్తి న్యూస్**
వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మంగళవారం తెల్లవారుజామున పశ్చిమ బెంగాల్‌లోని దీఘా సమీపంలో తీరం దాటింది. ప్రస్తుతం ఇది పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో కొనసాగుతూ.. ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలపై ప్రభావం చూపుతోంది. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రాబోయే 24 గంటల్లో ఈ తీవ్ర వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా పయనిస్తూ.. ఉత్తర ఒడిశా, దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల మీదుగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో తీర ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.



2లో..

## 29 వేల రేషన్ దుకాణాలు

# మరింత బలోపేతం

- మంత్రి నాదెండ్ల మనోహర్
- పౌరసరఫరాల శాఖలో సంస్కరణలు
- కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది
- కాకినాడలో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టు

2లో..



# అనంత ఛాంపియన్షిప్ అథ్లెటిక్స్ లో విజన్ విద్యార్థుల ప్రతిభ




**యాడికి , జూలై 28, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కి చెందిన విద్యార్థులు అనంత ఛాంపియన్షిప్ అథ్లెటిక్స్ పోటీల నందు విశేష ప్రతిభ కనపరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అత్యంత హోరాహోరీగా అనేక పాఠశాలల మధ్య పోటీలు నిర్వహించారు . అండర్ 14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో జి. శ్రీరంగ కుమార్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా ఎస్ కార్తీక్ మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ ని దక్కించుకోన్నారు. 200 మీటర్ల పరుగు పందెంలో విజన్ స్కూలుకు చెందిన హానిత్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ దక్కించుకోన్నారు. ఈ ముగ్గురి విజయం పట్ల పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# ఇంటింటి ప్రచారం లో తెదేపా



**యాడికి, జూలై 28, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో మంగళవారం మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం కార్యక్రమంను నిర్వహించారు.ముందుగా కరపత్రాలను ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, వేలూరు రంగయ్య లు మాట్లాడుతూ 2 సంవత్సరాల తెదేపా పాలన లో అభివృద్ధి, సంక్షేమం కు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.సాగునీటి ప్రాజెక్టులపైన, డిఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేశారని తెలిపారు.తదితర సంక్షేమ పథకాలు తెలిపారు.కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేరంగుల నాగశేఖర్, విజన్ విశ్వనాథ్,మార్ల మధురాజు, నంద్యాల రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత నీచమైన వ్యక్తి

(మొదటిపేజీ తరువాయి)

"దేశంలో యువత విద్యా వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేస్తోంది. ఎంతో మంది విద్యార్థినులు ఆందోళనల్లో పాల్గొన్నారు. వారిపై దాడులు జరిగాయి. అలాంటి సమయంలో అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిగా నియమించింది. అలాంటి వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అత్యాచార నిందితులకు రక్షణ కల్పించాలనే వ్యక్తే ఇప్పుడు భారత విద్యాశాఖ మంత్రి" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. అంతేకాకుండా ప్రధాని మోడీ నిర్ణయంపై కూడా విమర్శలు చేశారు. "ప్రధాని స్పందన చాలా విచిత్రంగా ఉంది. ఆయన మంత్రివర్గంలో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరినైనా ఎంపిక చేసుకోవచ్చు. కానీ అత్యాచార నిందితులను రక్షించే వ్యక్తినే ఎంపిక చేశారు. ఇది నిజంగా ఆశ్చర్యకరమైన విషయం." అని అన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా ప్రహ్లాద్ జోషి నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

# వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్

(మొదటిపేజీ తరువాయి)

వారసత్వ హక్కుల బదలాయింపులో పారదర్శకత పెంచడంతో పాటు, ప్రజలకు సులభమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత వివరాలు ఆటోమేటిక్‌గా రెవెన్యూ వ్యవస్థలో అప్‌డేట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టనున్నారు. అలాగే రూ.10 లక్షల లోపు విలువైన వారసత్వ భూములకు స్టాంప్ డ్యూటీని కేవలం రూ.100గా నిర్ణయించారు. దీని వల్ల చిన్న, మధ్య తరహా భూముల వారసులకు ఆర్థిక భారం తగ్గనుంది.

వీలునామా (విల్) లేకుండా వారసత్వ భూముల బదలాయింపు జరిగే సందర్భాల్లో రిజిస్ట్రేషన్ సమయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. దీని ద్వారా అసలైన వారసులను గుర్తించే ప్రక్రియ సులభతరం కానుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారసత్వ భూముల విషయంలో ఎదురయ్యే ఆలస్యాలు, అనవసరమైన కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు తగ్గే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం భూ పరిపాలనలో కీలక మార్పుగా అధికారులు భావిస్తున్నారు.

# వైసీపీపై మంత్రి లోకేశ్ ఫైర్

(మొదటిపేజీ తరువాయి)


అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు వైసీపీ హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో వారు నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ.. అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విష ప్రచారం చేస్తోంది' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.

# ప్రధాని మోడీ ఇన్‌స్టాకు క్రేజ్

**న్యూఢిల్లీ, జులై 28, అనంతజనశక్తి న్యూస్**

ప్రధాని నరేంద్రమోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డులు సృష్టిస్తున్నారు. ఇటీవల, నీట్ పేపర్‌లీక్ వివాదం, నిరసనల సమయంలో ఆయన పోస్ట్ చేసిన వీడియో ఏకంగా మిలియన్ల కొద్దీ వ్యూస్ వచ్చాయి. ఈ వీడియో తర్వాత ప్రధానికి ఏకంగా 40 లక్షల మంది కొత్త ఫాలోవర్లు పెరిగారు. ఇప్పుడు మొత్తం ఆయన ఇన్‌స్టా ఫాలోవర్లు 105 మిలియన్లు(10.5 కోట్లు)కు చేరుకుంది. కేవలం గత వారం రోజుల్లోనే నాలుగు మిలియన్ల మంది ఆయనను ఫాలో అవుతున్నారు. వారం క్రితం మోడీకి 101 మిలియన్ల(10.1 కోట్ల) మంది ఫాలోవర్లు ఉండగా, ప్రస్తుతం ఇది 105 మిలియన్లను అధిగమించింది. ఇప్పటి వరకు ఆయన ఇన్‌స్టాలో 1452 పోస్టులు షేర్ చేశారు.

ఇటీవల, సీజేపీయువత నిరసనల నేపథ్యంలో ప్రధాని మోడీ వరసగా 2 వర్టికల్ వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ రెండు వీడియోలకు లక్షలాది లైక్స్, కోట్ల సంఖ్యలో వ్యూస్ రావడంతో వైరల్‌గా మారాయి. ఒక వీడియోలో పేపర్ లీక్‌లను అరకిట్టేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకువస్తోందని విద్యార్థులకు మోడీ హామీ ఇవ్వడంతో పాటు, విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మరో వీడియోలో, జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్ని ఉద్దేశించి మాట్లాడారు. జెన్ జీ యువతను టార్గెట్ చేస్తూ ప్రత్యేకంగా రూపొందించిన వర్టికల్ వీడియోలకు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథం కూడా ప్రాధాన్యం ఇవ్వడంతో వీటికి భారీ రీచ్ ఏర్పడింది.



# ప్రేయసిని బైక్‌పై ఈడ్చుకెళ్లిన ప్రియుడు

(మొదటి పేజీ తరువాయి)

వీడియోలో యువతి బైక్‌ను పట్టుకుని సహాయం కోసం అరుస్తుండగా.. యువకుడు బైక్ ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లడం కనిపిస్తోంది. దీంతో యువతి రోడ్డుపై లాగబడుతూ తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఈ దృశ్యాలను చూసిన స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం.. యువకుడు బైక్ వేగంగా నడుపుతుండగా అది అదుపుతప్పి కిందపడింది. అనంతరం అక్కడికి చేరుకున్న స్థానికులు యువకుడిని చుట్టుముట్టి నిలదీశారు. కొందరు అతనిపై దాడి చేశారు. అయితే యువకుడు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆ యువతి తన భార్య అని చెప్పి, ఇది కుటుంబ వివాదమని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో మరింతగా దాడి జరగకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడని పోలీసులు తెలిపారు.

**ఐదేళ్ల ప్రేమ.. పెళ్లి విషయంలో గొడవ**

దర్యాప్తులో భాగంగా పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇద్దరూ దాదాపు ఐదేళ్లుగా ప్రేమలో ఉన్నారు. నిందితుడు నవాడా జిల్లాలోని నర్దిగంజ్ ప్రాంతంలో అమీన్ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అతను రాజగిర్‌కు వచ్చి యువతిని కలిశాడు. ఈ సందర్భంగా యువతి పెళ్లి విషయాన్ని ప్రస్తావించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో యువకుడు బైక్‌పై అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. యువతి ఆపేందుకు బైక్‌ను పట్టుకోగా.. ఆపాల్సిన బదులు అతను బైక్‌ను మరింత వేగంగా నడిపాడని, దీంతో ఆమె దాదాపు 100 మీటర్ల వరకు రోడ్డుపై లాగబడినట్లు వైరల్ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందని పోలీసులు తెలిపారు.

రాజగిర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అభిజిత్ కుమార్ మాట్లాడుతూ.. ఈ ఘటన పెళ్లి వివాదానికి సంబంధించినదని, నిందితుడు ప్రభుత్వ ఉద్యోగి అని ధృవీకరించారు. బాధిత యువతి నవాడా జిల్లాలోని నర్దిగంజ్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వైరల్ వీడియో ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

**అమరావతి, జులై 28, అంనతజనశక్తి న్యూస్**

అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. వివేకవంతమైన ఆలోచనలతో నిర్ణయాలు తీసుకోవాలని వారికి సూచించారు. కుప్పం పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడలను వీక్షించారు. అలాగే క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులను ఆమె పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి క్విజ్ పోటీ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. కుటుంబం ఇబ్బందుల్లో ఉంటే తల్లి దండ్రులకు పిల్లలు అండగా నిలవాలని సూచించారు. మంచి వ్యక్తులతో స్నేహం మన ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. తన మనవడు దేవాన్ష్ పుస్తకాలు బాగా చదువుతాడని.. టీవీ, మొబైల్‌కి దూరంగా ఉంటాడని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయని వివరించారు. విద్యార్థుల చదువుకు చేయూత అందించేందుకు మన ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఒక్కో బిడ్డకు రూ.15,000 ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో ప్రైవేటు నుంచి 1.06 లక్షల మంది విద్యార్థులు మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని సోదాహరణగా వివరించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతకు నారా భువనేశ్వరి సూచించారు. డ్రగ్స్‌తో జీవితాలు నాశనమవుతాయని.. వ్యసనాల నుంచి బయటపడటం చాలా కష్టమని అన్నారు. పరీక్షల్లో విఫలమవడం జీవితానికి ముగింపు కాదని పేర్కొన్నారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. అలాంటి చర్యల వల్ల కన్నతల్లిదండ్రులు కుంగిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని.. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. గురువులు మార్గదర్శకులని.. వారిని గౌరవించాలని విద్యార్థులకు నారా భువనేశ్వరి సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ, ప్రధాని నరేంద్రమోదీ వంటి వారి నుంచి స్ఫూర్తి పొందాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. మహోత్మునిలా సమాజానికి సేవ చేసే గుణం అలవరుచుకోవాలని విద్యార్థులతో అన్నారు. యువత చేతిలోనే మన దేశ భవిష్యత్ ఉందని గుర్తు చేశారు. ఎంచుకున్న రంగంలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారికి సూచించారు.

లక్ష్యంతో ముందుకెళ్తే టీచర్, ఇంజినీర్, డాక్టర్, బిజినెస్ మ్యాన్, పోలీస్, ఐఏఎస్, ఐపీఎస్ ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు స్పష్టం చేశారు. దేశ రక్షణలో పోలీసుల సేవలు అమూల్యమైనవని అభివర్ణించారు. క్రమశిక్షణతో జీవిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని విద్యార్థులతో నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

# అమరావతి పనుల్లో వేగం

**అమరావతి, జులై 28, అనంత జనశక్తి న్యూస్**

రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో మరింత వేగం తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఆదేశించారు. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సమాహారం మాత్రమే కాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలిపి సమగ్ర రాజధాని ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని నిర్మాణ పనులపై కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. రాజధాని నిర్మాణంలో స్పీడ్, క్వాలిటీ, డెలివరీ ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని, ఇప్పటికే పనుల వేగం కొంత పెరిగినా ఇంకా మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజధానిలో ప్రస్తుతం 95 ప్రాజెక్టులకు సంబంధించి రూ.50,999 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఈ పనుల్లో ప్రతి నెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. నిర్ణయించిన గడువులోగా ప్రతి ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణం చేపట్టడం నిర్మాణ సంస్థలకు ఒక గొప్ప అవకాశమని, ఆ అవకాశాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటోందని, అందువల్ల పనుల్లో ఆలస్యం జరిగే పరిస్థితి ఉండకూడదని హెచ్చరించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్ల ఆమోదం వంటి అంశాల్లో అన్ని శాఖలు, ఉన్నతాధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించి పనులు ఆగకుండా చూడాలని సూచించారు.

అమరావతి అభివృద్ధి ప్రణాళికలో విజయవాడ, గుంటూరు నగరాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపు, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఇకపై తాను కూడా స్వయంగా ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తయితేనే ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిద్దే లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు సీఎం నారా చంద్రబాబు నాయుడు..

ల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు తక్కువగా కురుస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లోనూ తక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. వచ్చే మూడు నెలలు కూడా లోటు వర్షపాతం నమోదు కావొచ్చన్న వాతావరణ శాఖ అంచనాల నడుమ.. ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎల్‌నినో కారణంగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు, వాటి ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు వివరాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు.

జూన్ నెల నుంచి నవంబర్ నెల మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 551 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఒక్క జూలై నెలలోనే 69 శాతం మేరకు లోటు వర్షపాతం నమోదైందని.. రాబోయే మూడు నెలలలో సరాసరి 35 శాతం నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేశారు. ఎల్‌నినో కారణంగా వైఎస్సార్ కడప, అన్నమయ్య, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో వర్షాభావ పరిస్థితి నెలకొందని తెలిపారు. 1.07 లక్షల హెక్టార్లలో వరి, 2.78 లక్షల హెక్టార్లలో పత్తి సాగుపై ఎల్‌నినో ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 122 హై రిస్క్ మండలాలను గుర్తించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ నేపథ్యంలో హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. అలాగే ఆగస్ట్ మూడో తేదీ నుంచి రాష్ట్రంలోని రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మరోవైపు జూలై 31వ తేదీ వరకూ రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం నమోదు ప్రక్రియ కొనసాగించనున్నట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు.

## 29 వేల రేషన్ దుకాణాలు
# మరింత బలోపేతం

**అమరావతి, జులై 28, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల పార్బాయిల్డ్ ధాన్యం సేకరణకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 'మీ మార్ట్' కాన్సెప్ట్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్లలో తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని విక్రయించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

ఏపీ వ్యాప్తంగా స్వర్ణ వెరైటీ బియ్యాన్ని కిలో రూ.40కు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రేషన్ కార్డుదారులకు 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.281 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ధాన్యం ట్రాకింగ్‌కు ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీని అమలు చేస్తున్నామని అన్నారు. డిజిటల్ వాలెట్ విధానం ద్వారా సబ్సిడీల పంపిణీకి పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెప్పారు.

ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల కమిషన్ పెంపునకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మిల్లర్లతో చర్చలు జరిపామని, ప్రస్తుతం కిలో రైస్ ధర రూ.52 వద్ద ఉండేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వెరైటీ రైస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# తీరం దాటిన తీవ్ర వాయుగుండం

(మొదటిపేజీ తరువాయి)



ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాయుగుండం ప్రభావం కనిపించనుంది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, బాపట్ల, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలోనూ కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తీవ్ర వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. కళింగపట్నం నుంచి కాకినాడ వరకు ఉన్న ఓడరేవుల్లో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేయగా.. కోస్తాలోని ఇతర ఓడరేవుల్లో మొదటి నంబర్ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. ప్రజలు వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. తీర ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున అనవసరంగా సముద్ర తీరాలకు వెళ్లకుండా ఉండాలని కూడా హెచ్చరించారు.

# ప్రధాని కోసం ధర్మేంద్ర తొలగించారు

**న్యూఢిల్లీ, జులై 28, అనంతజనశక్తి న్యూస్**



పార్లమెంట్‌లో మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై వాడీవేడి చర్చ నడుస్తోంది. ప్రతిపక్షాలు బీజేపీని విమర్శిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. "ప్రధాన్‌ను తొలగించి ప్రధాన మంత్రిని కాపాడారు" అంటూ సెటైర్లు వేశారు. ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్‌ను బలిపశువు చేసినట్లు ఆరోపించారు. విద్యార్థి ఉద్యమం ప్రభుత్వం మెడలు వచ్చిందని అన్నారు. రాజీనామా తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌కు వచ్చినప్పుడు బీజేపీ ఎంపీలు ఘనంగా స్వాగతించాయని, ఆయన తొలగింపు ఎంత పెద్ద సంక్షోభం నుంచి బయపడేసిందో ఊహించండి అని అఖిలేష్ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాన్ని తల వంచేలా చేసిన యువత ధైర్యసాహసాలను అఖిలేష్ ప్రశంసించారు. "ప్రపంచం వంగుతుంది, దానిని వంచే వ్యక్తి ఉండాలి. ప్రభుత్వం ఎప్పటికీ తలవందననుకుంది, కానీ యువత ఐక్యత ముందు ప్రభుత్వం వెనక్కి తగ్గి మంత్రితో రాజీనామా చేయించింది" అని అన్నారు. తల్లిదండ్రుల మద్దతు పొందిన తొలి విద్యార్థి ఉద్యమం ఇదే అని ఆయన అన్నారు. ప్రభుత్వం భయపడినప్పుడే డిమాండ్లను అంగీకరిస్తుందని, రైతుల ఉద్యమ సమయంలో ఎన్నికలు సమీపించడంతో మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని గుర్తు చేశారు.

బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థ, యూనివర్సిటీలనను దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. విద్యావ్యవస్థకు ఒకే రంగు వేయాలని బీజేపీ ప్రయత్నించిందని, అందుకే విద్యార్థుల్లో ఆగ్రహం పెరిగిందని, భారీ ఉద్యమంగా మారిందని, చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ కూడా వెనక్కి తగ్గాల్సి వచ్చిందని అన్నారు. దళితులు, వెనకబడిన వర్గాల ఉద్యోగ హక్కుల్ని ప్రభుత్వం హరిస్తుందని ఆయన ఆరోపించారు.

# దమ్ముంటే చర్చకు రా

- మంత్రి లోకేష్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్!
- డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు
- వాటిపై బహిరంగ చర్చకు రావాలి

**అమరావతి, జులై 28, అనంతజనశక్తి న్యూస్**

మెగా డీఎస్సీ నియామకాల వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం చెలరేగింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పేర్ని నాని తీవ్ర విమర్శలు చేశారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, వాటిపై బహిరంగ చర్చకు రావాలని లోకేష్‌కు సవాల్ విసిరారు. కృష్ణా జిల్లాలో మీడియాతో మాట్లాడిన పేర్ని నాని.. ప్రభుత్వం ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.

మంత్రి నారా లోకేష్ విద్యాశాఖతో పాటు ఇతర శాఖల వ్యవహారాల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారని పేర్ని నాని విమర్శించారు. కంపెనీలు తీసుకొచ్చామని, ఉద్యోగాలు కల్పించామని, రెడ్ బుక్ గురించి వ్యాఖ్యలు చేస్తూ అన్ని విషయాల్లో తన పాత్ర ఉందని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యకర్తల చప్పట్ల కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. 'సీఎం చంద్రబాబు చర్చకు వస్తే వైఎస్ జగన్ వస్తారు. నారా లోకేష్ చర్చకు వస్తే నేను సిద్ధంగా ఉన్నాను. దమ్ముంటే డీఎస్సీ అక్రమాలపై నాతో బహిరంగ చర్చకు రావాలి' అని పేర్ని నాని సవాల్ చేశారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన లోకేష్ మాటలు హద్దులు దాటుతున్నాయని, ప్రతి అంశంలో తానే చేశానని చెప్పుకోవడం సరికాదన్నారు.

డీఎస్సీ నియామకాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదని పేర్ని నాని ఆరోపించారు. జిల్లా కలెక్టరేట్లలో మెరిట్ జాబితాలను ఎందుకు ప్రదర్శించలేదని ప్రశ్నించారు. స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో అర్హులకు కాకుండా అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపిస్తూ.. ఈ వ్యవహారంపై న్యాయస్థానం కూడా విచారణ జరపాలని సూచించిందన్నారు. డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిజాయితీగా ఉంటే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, ఆరోపణలు నిజమైతే మంత్రి లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. మంత్రి పదవి కోసం బోండా ఉమా ముచ్చట పడుతున్నారని, మీరు రాజీనామా చేసి ఆయనకు మంత్రి పదవి ఇవ్వండని పేర్ని నాని విరామర్శించారు.

# శాంతియుత నిరసనలపై పోలీసుల బలప్రయోగం సరికాదు




శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కు అని, దాన్ని ఎవరికీ నిరాకరించే అవకాశం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేయడాన్ని సమర్థించలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణకు సంబంధించి ఏకరూప మార్గదర్శకాలు రూపొందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల వ్యవస్థలో అక్రమాలకు వ్యతిరేకంగా దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జి, బాష్పవాయువు గోళాలను ప్రయోగించారంటూ దాఖలైన పిటిషన్లపై సోమవారం విచారణ ప్రారంభమైంది.

ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన సభ్యులుగా ఉన్నారు. ''శాంతియుత ఆందోళన చేయాలనుకుంటే అందుకు ఒక నిర్దిష్ట ప్రొటోకాల్ ఉండాలి. అలాంటి నిరసనలకు తగిన స్థలాన్ని కల్పించాలి. సంఘ విద్రోహ శక్తులు చొరబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. పోలీసుల భద్రత కూడా చాలా ముఖ్యమైనదే''నని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. బిహార్‌లో విద్యార్థులపై ఓ పోలీసు ఏకే47 గురిపెట్టిన ఘటన కూడా ప్రస్తావనకు వచ్చింది. నిరసనల్లో పోలీసులపై దాడులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులు దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను కూడా ఇతర పిటిషన్లతో కలిపి మంగళవారం విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

**నీలేకని కమిటీ ఏం చెప్తుందో చూద్దాం..**

నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలన్న అభ్యర్థనలపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ప్రశ్నపత్రాల లీకేజీని నివారించేందుకు అదనపు భద్రతా చర్యలు అవసరమని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆలోక్ ఆరాధే ధర్మాసనం అభిప్రాయపడింది. నందన్ నీలేకని నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎలాంటి సూచనలు చేస్తుందో చూద్దామని, ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

# ప్రశ్నపత్రాల రూపకర్తల విశ్వసనీయతే అతిపెద్ద సవాల్: కామకోటి



పరీక్ష పత్రాలను రూపొందించే వారి విశ్వసనీయత, నిజాయతీలే పరీక్షల నిర్వహణలో అతిపెద్ద సవాల్ అని కేంద్రం నియమించిన పరీక్షల సంస్కరణల టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయిందని, సాంకేతికపరమైన జోక్యం ఎంతో ప్రాధాన్య అంశంగా మారిందని చెప్పారు. సోమవారం చెన్నైలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ''ఇప్పటికైతే ప్రశ్నపత్రాల రూపకర్తల విశ్వసనీయతే ఎక్కువ ప్రాధాన్యాంశం. ఎందుకంటే పరీక్ష నిర్వహణపై ఇప్పటికే కెమెరాల నిఘా వచ్చేసింది. నీట్ 2024లో చూస్తే ప్రశ్నపత్రాలను ముద్రణ అనంతరం తరలిస్తున్నప్పుడు లీకయ్యాయి. నీట్ 2026 లీక్ అలాంటిది కాదు. ముద్రణ, తరలింపు అంతా పక్కాగానే జరిగింది. తయారు చేసినప్పుడే పేపరు లీకైనట్లు దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అత్యంత గోప్యంగా, విశ్వసనీయంగా ప్రశ్నపత్రం రూపొందించి, బాధ్యతను నమ్మకంగా పూర్తిచేసే అధ్యాపకులు మనకు కావాలి. పూర్తి పారదర్శక, విస్తృత, లీకేజీకి ఆస్కారంలేని వ్యవస్థ రూపొందేలా సంస్కరణలు తేవడం మా కమిటీ బా ధ్యత'' అని కామకోటి పేర్కొన్నారు.

# కేసులు ఎత్తివేయకపోతే మళ్లీ నిరసనలు

**- కేంద్రానికి సీజేపీ హెచ్చరిక**



కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల విరమణతో పరిస్థితులు కుదుటపడినట్లు కనిపిస్తున్నవేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. నిరసనకారులపై పోలీసు చర్యలు ఉండవంటూ తమకిచ్చిన హామీని ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని సీజేపీ సోమవారం ఆరోపించింది. ఇటీవలి నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు పలు రాష్ట్రాల్లో వేధింపులకు గురవుతున్నారని పేర్కొంది. చర్చల్లో మాటిచ్చినట్లు కేసుల ఎత్తివేతపై రాతపూర్వక హామీని మంగళవారం కల్లా తమకు అందించకపోతే మళ్లీ ఆందోళనల బాట పడతామని హెచ్చరించింది. అయితే నీట్ పేపర్ లీక్‌పై నిరసనల వేళ తమ రాష్ట్రంలో నమోదైన కేసులన్నింటినీ ఎత్తివేస్తున్నట్లు బిహార్ ప్రకటించడం కొంత ఉపశమనం కలిగించే విషయం.

**ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి**

సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆశుతోష్ రాంకా దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఇటీవలి నిరసనల్లో పాల్గొన్నవారిపై క్రిమినల్ కేసులు ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. ''దేశవ్యాప్తంగా నిరసనకారులు, నిరసనల నిర్వాహకులపై నమోదైన అన్ని ఎఫ్‌ఐఆర్‌లను ఎత్తివేయాలని.. వారిపై కొత్త ఎఫ్‌ఐఆర్‌లేవీ దాఖలు చేయకూడదని ఇటీవల ప్రభుత్వంతో జరిగిన మూడో విడత చర్చల్లో అంగీకారం కుదిరింది. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్రసింగ్‌లకు ముసాయిదా ఒప్పందాన్ని మేం సమర్పించాం. న్యాయపరమైన సంప్రదింపుల అనంతరం దానిపై రాతపూర్వక ఒప్పందాన్ని మంగళవారం కల్లా ప్రభుత్వం సమర్పించాలని అంగీకారం కుదిరింది. ఆ ఒప్పందం మాకు అందాల్సి ఉంది. కేసులను ఎత్తివేస్తామని, నిరసనకారులు/నిర్వాహకులను వేధించబోమని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ఆశిస్తున్నాం. మంగళవారం కల్లా మాకు రాతపూర్వక ఒప్పందం అందకపోతే.. అరెస్టయిన నిరసనకారులను విడుదల చేయకపోతే.. తప్పనిసరి పరిస్థితుల్లో మేం మళ్లీ నిరసనలకు దిగాల్సి వస్తుంది'' అని పేర్కొన్నారు. బిహార్, బెంగాల్‌లలో వందల మంది విద్యార్థులను అరెస్టు చేశారని.. దిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో వందల మంది వేధింపులకు గురవుతున్నారని రాంకా ఆరోపించారు.

**వ్యక్తుల స్థాయిలో లక్ష్యంగా చేసుకునే ముప్పు**

నిరసనలను ముగించడానికి ముందు, తర్వాత తాము సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను సంప్రదించామని ఆశుతోష్ రాంకా తెలిపారు. తమ ఉద్యమాన్ని రాజకీయ ప్రేరేపితమైనదిగా ఎవరూ పక్కదోవ పట్టించకుండా ఉండేందుకు అవసరమైన చర్యలపై ఆయనతో చర్చించినట్లు వెల్లడించారు. ''నిరసనలను ముగించాక ప్రభుత్వం మమ్మల్ని వ్యక్తుల స్థాయిలో లక్ష్యంగా చేసుకునే ముప్పు ఉంటుందని అనుమానాలు ఉండేవి. ఇతర నిరసనల సమయంలో అలా జరిగింది. వ్యక్తులను లక్ష్యంగా చేసుకున్నారు'' అని కూడా రాకా పేర్కొన్నారు. ఇటీవల నిరసనల్లో పాల్గొన్న విద్యార్థుల్లో ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోకూడదని కపిల్ సిబల్ నొక్కిచెప్పారు.

న్యాయ సహాయం కోసం ఆన్‌లైన్ ఎయిడ్ ఫండ్

ఇటీవలి నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రజల విరాళాలతో ఆన్‌లైన్ లీగల్ ఎయిడ్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీజేపీ వెల్లడించింది. ఈ ఫండ్‌కు కపిల్ సిబల్ రూ.కోటి విరాళం ప్రకటించారు.

**విందుపై భాజపా ప్రశ్నలు.. తిప్పికొట్టిన సీజేపీ**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్ సహా సీజేపీ ముఖ్యులు ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో పెద్ద విందు చేసుకున్నారని భాజపా జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా సామాజిక మాధ్యమాల్లో ఆరోపించారు. నీట్ పేపర్ లీక్‌తో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంఘీభావం ప్రకటించే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. విందు సంబంధిత వీడియోను తన పోస్టుకు జత చేశారు. పూనావాలా విమర్శలను సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తిప్పికొట్టారు. ''నేటి తరం యువత ఇలాగే ఆత్మవిశ్వాసంతో, సృజనాత్మకంగా, పట్టుదలతో ఉంటుంది. మూస ధోరణిలో ఆలోచించదు. అర్థం చేసుకోలేని అంకుల్‌లు, ఆంటీలు ఫిర్యాదులు చేసుకుంటూ ఉండొచ్చు'' అని సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు.

980 మందికి క్రిమినల్ రికార్డులు

జంతర్ మంతర్ వద్ద ఇటీవల నిరసనల్లో పాల్గొన్న వారిలో 2,873 మంది వివరాలను పోలీసులు విశ్లేషించగా.. వారిలో 980 మందికి క్రిమినల్ రికార్డులు ఉన్నట్లు తేలింది. హత్య, హత్యాయత్నం, దోపిడీ, అత్యాచారం, అపహరణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసులున్నవారు అందులో ఉన్నట్లు గుర్తించారు. 101 మందికి హత్య కేసుల్లో ప్రమేయం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనల వేళ ప్రధాన మంత్రి సహా పలువురు సీనియర్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పెట్టిన పోస్టులను తొలగించాలంటూ పలు సోషల్ మీడియా అకౌంట్లకు దిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. పాకిస్థాన్‌తో సంబంధాలున్న 480కి పైగా సోషల్ మీడియా హ్యాండిళ్లు ఇటీవలి నిరసనలకు సంబంధించి వదంతులు, డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేసినట్లు గుర్తించామని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

ఈ నెల 25న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న తమను సత్యం పండిత్ వ్యక్తి అడ్డుకొని వేధించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని సత్యం పండిత్ పేరు, చిరునామా, మతం వంటి వివరాలు అడుగుతున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది.

# ఇంటినుంచి బయటకు వెళ్లగానే ఫోన్ స్విచ్ఛాఫ్.. 24 గంటల్లో 10 మంది మిస్సింగ్!




మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో గత 24 గంటల్లో వివిధ ప్రాంతాల్లో 10 మంది అదృశ్యమయ్యారు ఇంటి నుంచి బయటకు వెళ్లగానే వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ అవడం.. ఆ వెంటనే వారి జాడ లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మిస్సింగ్‌లకు సంబంధించి పోలీసు కేసులు నమోదయ్యాయి. అదృశ్యమైన 10 మందిలో ముగ్గురు మైనర్లు ఉన్నారు. కోలార్, అయోధ్య నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువగా ఈ మిస్సింగ్ కేసులు రిజిస్టర్ అయ్యాయి . మరికొన్ని కేసులు అశోకాగార్డెన్, టీటీ నగర్, రతిబాద్, అవధ్‌పురి పరిధిలో నమోదయ్యాయి. కొన్ని కేసుల్లో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. మిస్ అయినవారి ఫోన్లు బయటకు వెళ్లగానే స్విచ్ఛాఫ్ అయ్యాయి. దాంతో సెర్చ్ ఆపరేషన్ క్లిష్టంగా మారింది. అశోకాగార్డెన్ ప్రాంతంలో 17 ఏళ్ల విద్యార్థి తరగతులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత తిరిగిరాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయోధ్య నగర్ నుంచి 19 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు మిస్ అయ్యారు. కొలార్‌లో 20 ఏళ్ల యువకుడు, 40, 45 ఏళ్ల ఇద్దరు వ్యక్తులు కనిపించకుండా పోయారు. మిగతా ప్రాంతాల నుంచి ఒక్కొక్కరు మిస్ అయ్యారు. ఈ వరుస ఘటనలపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పోలీసులు వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తున్నామని చెప్పారు.

# చర్చకు ప్రభుత్వం.. క్షమాపణకు విపక్షం.. పట్టు

**- ప్రశ్నపత్రాల లీకేజీపై లోక్‌సభలో బిల్లు**
**- 2024 చట్టం కఠినతరం చేసేలా ప్రతిపాదనలు**
**- చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ససేమిరా**
**- విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్**
**- ఉభయ సభలు నేటికి వాయిదా**



ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడినవారికి కఠిన శిక్షలు విధించేలా 2024నాటి చట్టాన్ని సవరించే బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. చర్చకు లోక్‌సభలో ఆరు గంటలు, రాజ్యసభలో ఏడుగంటలు చొప్పున సమయాన్ని కేటాయిస్తున్నట్లు సభాపతులు ప్రకటించారు. అయితే నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో దిల్లీలో దీక్షలు చేపట్టినప్పుడు విద్యార్థులపై పోలీసులు ప్రవర్తించిన తీరుమీద సమగ్రంగా చర్చ చేపట్టాల్సిందేనని విపక్షాలు డిమాండ్ చేసి సభలను స్తంభింపజేశాయి. విద్యార్థి లోకానికి ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని, వారిపై పోలీసుల దాష్టీకానికి గానూ హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని అవి గట్టి పట్టుపట్టాయి. ఈ పరిస్థితుల మధ్యే 'పబ్లిక్ పరీక్షల్లో అనుచిత పద్ధతుల నివారణ సవరణ బిల్లు 2026'ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పెల్లెట్లు ప్రయోగించి ఆందోళనకారుల్ని గాయపరిచినవారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ గళమెత్తాయి. అధికారవిపక్షాలు విభేదాలు పరిష్కరించుకునేందుకు స్పీకర్ ఓం బిర్లా మూడు గంటల సమయం ఇచ్చి సభను వాయిదా వేసినా సయోధ్య కుదరలేదు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ చర్చ నుంచి తాము పారిపోవడం లేదని, ముందు హోంమంత్రి వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు పరిస్థితి మారకపోవడంతో ఉభయ సభాపతులు సభలను మరుసటిరోజుకు వాయిదా వేశారు. బిల్లుపై లోక్‌సభలో మంగళవారం చర్చ జరిగే అవకాశం ఉంది. ఆ మేరకు విపక్షాలను స్పీకర్ ఒప్పించారు.

**ప్రభుత్వం సమాధానం చెప్పాలి**

విపక్షాల నిరసనల మధ్య రెండు సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా నిర్మాణాత్మక చర్చ జరపాలని, పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని ప్రకటించిన చర్యలను గుర్తించాలని కోరారు. సంతృప్తి చెందని విపక్షాలు పార్లమెంటు సముదాయంలో నిరసనలు కొనసాగించాయి. మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో అడుగుపెడుతున్నప్పుడు అధికార పక్షం 'జిందాబాద్.. జిందాబాద్' అని, విపక్షం 'చోర్ చోర్.. పేపర్ చోర్' అని పోటాపోటీగా నినాదాలు చేశాయి.

**చట్టంలో ఏడు కీలక సవరణలు**

**పబ్లిక్ పరీక్షల బిల్లులో ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు.**

పేపర్ లీక్‌లు, పరీక్షల అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది.

ఛార్జిషీటు దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తిచేయాలని ప్రతిపాదించారు.

రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది.

పరీక్షల అక్రమాల దర్యాప్తు కోసం అవసరమైతే కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తుంది.

రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి.

నేరస్థులకు మరింత కఠిన జైలుశిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది.

హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీలు చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.

పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే పదేళ్ల వరకు జైలుశిక్ష విధించేలా చట్టంలో మార్పులను ప్రభుత్వం ప్రతిపాదించింది. వ్యవస్థీకృత నేరాలకు కనీసం ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా పడుతుంది.

అక్రమార్కులకు గరిష్ఠ జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు, సర్వీస్ ప్రొవైడర్‌స్‌కు విధించే జరిమానాను రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు.

పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్‌స్‌ను నిషేధించే కాలాన్ని నాలుగేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పొడిగించాలని ప్రతిపాదించారు.

ప్రశ్నపత్రాల లీకేజీతో పాటు ఓఎంఆర్ షీట్లలో అక్రమాలు, నకిలీ వెబ్‌సైట్ల సృష్టి, తప్పుడు అడ్మిట్‌కార్డుల తయారీ వంటి 15 పనులను చట్టవిరుద్ధమైనవిగా పరిగణిస్తారు.

# ఏ నిరసనకారుడిని ఒంటరిని చేయబోం: సీజేపీ



తమతో కలిసి పోరాడిన ఏ నిరసనకారుడిని ఒంటరిని చేయబోమని కాక్రోచ్ జనతా పార్టీ (CJP) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రతినిధులతో సోమవారం అర్ధరాత్రి చర్చలు జరిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరసనకారుల (Protesters)పై భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోబోమని వారు తమకు హామీ ఇచ్చారన్నారు. బిహార్, అస్సాంలో ఆందోళనలో పాల్గొన్న వారిపై కేసులను ఆయా ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయని తెలిపారు. నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయడంపైనా కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఆందోళనకారులపై రేపటిలోగా కేసులు ఎత్తివేయాలని కోరామన్నారు. అందుకు వారు అంగీకరించారని వెల్లడించారు.

**నిరసనల్లో నేరగాళ్లు..**

సీజేపీ నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఆందోళనల్లో పాల్గొన్న వారి ఫేషియల్ రికగ్నిషన్‌ను దిల్లీ పోలీసులు చేపట్టారు. వారిలో 2,873 మందికి క్రైమ్ రికార్డులు ఉన్నట్లు తేలింది. 101 మందిపై హత్య, 62 మందిపై హత్యాయత్నం, 284 మందిపై దోపిడీ, 25 మందిపై లైంగిక వేధింపులు, 229 మందిపై ఆయుధాల చట్టం ఉల్లంఘన, 61 మందిపై అత్యాచారం ఆరోపణలు, ఆరుగురిపై పోక్సో వంటి కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. పలువురు నిరసనకారులు ఉద్దేశపూర్వకంగానే భద్రతాబలగాలపై దాడి చేశారని.. ఆ వీడియోలు సైతం సేకరించినట్లు తెలిపారు. అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను హెచ్చరించారు.

# 16 మంది మావోయిస్టుల లొంగుబాటు.. ఆరుగురిపై రూ.39 లక్షల రివార్డు

**జార్ఖండ్ పోలీసుల ముందు 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన ఆరుగురిపై రూ.39 లక్షల వరకు రివార్డ్ ఉంది. ఈ విషయాన్ని మంగళవారం రాష్ట్ర పోలీసు అధికారులు ధ్రువీకరించారు. 128 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న సంతోష్ మహతో అలియాస్ వాసుదేవ్ అలియాస్ దిలీప్‌పై రూ.15 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టు దళం రీజినల్ గ్రూప్ సభ్యుడైన మహతో సరెండర్ కావడం కీలక విషయమని పోలీసులు తెలిపారు. జోనల్ కమిటీ సభ్యుడు చందన్ లోహ్రా 78 కేసుల్లో వాంటెడ్‌గా ఉండగా.. అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టులు లొంగిపోవడంతోపాటు ఆయుధాలు అప్పగించారు. అందులో రెండు ఏకే-47 రైఫిళ్లు ఉన్నాయి.**

# చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

**ఉత్తరాఖండ్‌లో భారీ వర్షా లు, కొండచరియలు విరిగిపడుతుండటంతో చార్‌ధామ్ యాత్ర (Char Dham Yatra) మార్గాలు పలు చోట్ల దెబ్బతిన్నాయి. యాత్రికుల భద్రత దృష్ట్యా మంగళ, బుధవారాల్లో యాత్రను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ భారీ వర్షా ల హెచ్చరికలు జారీ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, రహదారులను పునరుద్ధరించిన తర్వాత యాత్రను తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు. అప్పటి వరకు యాత్రకు బయలుదేరే భక్తులు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు.**



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
బుధవారం | రంగారెడ్డి
29.07.2026




# సమానత్వమే జగన్నాథుని మంత్రం

శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజన గీతాలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహాప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్న అనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహాప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహాప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. “అంతటా ఉండే ఓ మహాప్రభూ... నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను... నా పూర్ణ హృదయంతో...” అని ఆ పాటకి అర్థం.

లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథుని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహాప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనేవారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన ‘ఆహే నీల శైల’ అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. “పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహాప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే.. ఎప్పటికీ మరచిపోం” అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహా ప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే ‘బడ దేవుళ’ లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం- పూరీ చాలా దూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను. అక్కడ బాలికల ఉన్నత పాఠశాల యూనిట్–2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండేదాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నా మదిలో స్పష్టంగా ఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా?

ఎవరైనా మహాప్రభు జగన్నాథుని రథయాత్రను మరచిపోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్సవాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనం కోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తులకు దర్శనమిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై.. చక్రరాజ సుదర్శనునితో పాటు.. ముగ్గురు దేవతామూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడు రోజులు ఉండి, ఆ తర్వాత తిరుగు ప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్సవానికి సాటి లేదు.

చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖదుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా.


భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహాప్రభుని తలచుకున్నాను. ‘నన్ను ఇంత పెద్ద స్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు’ అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్సవం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హౌజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీ జగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహాప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సులను కురిపించారు. పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జూలై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ... దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరిస్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సులతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది.

అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అనిపించింది. ‘మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి’ అని మౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబర్ 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడ దాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది. బడ దాండ శ్రీ జగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందా? అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టాను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీల చక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను.

ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరువైపులా ఉన్న బాలలు, మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభుమీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి... ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే. అందరూ వదిలేసిన వారికి కూడా ఆయనే రక్షకుడు. లోకంలోని జనుల కష్టాలను తీర్చేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటారు.

# స్వతంత్రత కోల్పోతున్నదా?

**ఒక తండ్రి తన అయిదేళ్ల కుమారుడిని స్కూలుకు తీసుకువెళుతుండగా, ఒక ట్యాంకర్ వెనుకనుంచి వచ్చి ఢీకొనడంతో ఆ బాలుడు మరణించాడు. ఆ రోడ్డుకు ఫుట్‌పాత్ కానీ, రోడ్డు దాటేందుకు క్రాసింగ్ గుర్తులు కానీ లేవు. దేశంలో ఇలాంటి ఘటనలు పెద్ద సంఖ్యలో జరుగుతూనే ఉంటాయి కానీ ఉన్నత న్యాయస్థానం మాత్రం ఈ విషాద ఘటనపై అరుదైన రీతిలో స్పందించింది. నడిచి వెళ్లడం అనేది ఆర్టికల్ 19(1)(డి), ఆర్టికల్ 21 క్రింద ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆదేశాలు జారీ చేశారు. రహదారులను వాహనాల కోసమే కాకుండా పాదచారులకు అనువైన విధంగా నిర్మించాలని ఆయన చెప్పారు. భారతదేశంలో నడిచి వెళ్లడం అనేదానికి సాంస్కృతిక, మతపరమైన, రాజకీయ, సామాజిక విలువ ఉన్నదని కూడా ఆయన గుర్తు చేశారు. దండి యాత్ర, భూదానోద్యమం లాంటి చారిత్రక ఘటనలను జస్టిస్ నరసింహ ఉదహరించారు. నడిచి వెళ్లడమే ఒక ఘర్షణగా మారిన ఈ దేశంలో ఏటా సగటున 36,500 మంది పాదచారులు సరైన ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు లేక మరణిస్తున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. 80శాతం పట్టణ రోడ్లలో సురక్షితమైన, నడిచివెళ్లే వారికి అనువైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయి. మెట్రో నగరాల్లో 44శాతం రోడ్లకు అసలు ఫుట్‌పాత్‌లే లేవు. ఉన్న ఫుట్‌పాత్‌లలో అత్యధికం ఇండియన్ రోడ్ కాంగ్రెస్ విధించిన నిబంధనలకు అనుగుణంగా లేవు. వికసిత్ భారత్, ట్రిలియన్ ఎకానమీ, విశ్వనగరాల గురించి మాట్లాడే ప్రభుత్వ పెద్దలకు దేశంలో నడిచివెళ్లే వారి దుస్థితి గురించి ఎంతవరకు తెలుసు?**



ప్రజల ప్రాథమిక హక్కులకు అనుగుణంగా చట్టాలు చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. మోటారు వాహనాల చట్టం చేసినప్పుడు నడిచి వెళ్లే ప్రజల ప్రాథమిక హక్కును గుర్తించలేదని, ఈ చట్టం కేవలం వాహనాల కోసమే చేసినట్లున్నదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ప్రధాన న్యాయమూర్తి కానున్న రెండో తెలుగువాడైన జస్టిస్ పీఎస్ నరసింహ నడకను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పు ఇచ్చిన తర్వాత ప్రజల నుంచి విపరీతమైన ప్రతిస్పందన వచ్చింది. అనేక నగరాల్లో ఫుట్‌పాత్‌లు లేకపోవడం గురించి కథనాలు వస్తున్నాయి. రూల్ ఆఫ్ లా, స్వతంత్ర వైఖరి, ప్రమాణాల గురించి న్యాయవాదులు ముందుగా తెలుసుకోవాలని, విశ్వసనీయత పెంచుకోవాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన మరో తీర్పుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించింది. జస్టిస్ నరసింహ సూచించినట్లుగా న్యాయవాదులకు జాతీయ లీగల్ అకాడమీని ఏర్పర్చేందుకు సిద్ధమయింది. ‘గురుబ్రహ్మ, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః’ అని శ్లోకాలు చదవడం ప్రధానం కాదు, ఆ గురువులకు సరైన జీతాలు ఇవ్వాలి.. అని గుజరాత్ విద్యాలయాల్లో అధ్యాపకులకు కనీస వేతన స్కేలును వర్తింపచేయాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన తీర్పును కూడా అనేకమంది స్వాగతించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరిట రాజస్థాన్ గుజరాత్ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులకు ముప్పు రాకుండా ఆయన అడ్డుకున్నారు.

మండుటెండల్లో మంచి చినుకుల్లాగా అప్పుడప్పుడూ జస్టిస్ నరసింహ మాత్రమే కాదు, జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్ తదితరులు ఇచ్చిన కొన్ని మంచి తీర్పులను విస్మరించలేం. వందమీటర్ల ఎత్తు దాటితే ఆరావళి పర్వతాలను కూల్చివేయవచ్చని ఇచ్చిన తీర్పును పర్యావరణవేత్తల ఆందోళనతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేశారు. పలు చెప్పుకోదగ్గ తీర్పులు అడపాదడపా సుప్రీంకోర్టు నుంచి వస్తున్నప్పటికీ న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తోందా అన్న చర్చ మాత్రం ఆగడం లేదు.


దేశంలో ఉన్నత న్యాయస్థానం పాత్ర రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్న విషయం చర్చనీయాంశమవుతోంది. సుప్రీంకోర్టు అస్తిత్వం కోల్పోతోందని, ఎవరి నియంత్రణలోనో ఉన్నట్లుగా వ్యవహరిస్తోందని, ప్రాథమిక హక్కులను విస్మరిస్తోందని మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఘటనను దేశం మరిచిపోకముందే గతవారం ఒక పిటిషనర్ నిండు కోర్టులో సీజేఐపై అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు సర్వోన్నత న్యాయస్థానం పట్ల పెరుగుతున్న నిరాశా నిస్పృహలకు సంకేతాలుగా అభివర్ణించేవారున్నారు. మరోవైపు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున డబ్బు దొరికిన ఘటన రీత్యా ఆయనపై మహాభియోగం ప్రవేశపెట్టేందుకు పార్లమెంట్ సిద్ధమవుతోంది. న్యాయవ్యవస్థను ఆత్మరక్షణలో పడవేసేందుకు లభించే అవకాశాన్ని ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుంది?

రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటే న్యాయవ్యవస్థ స్వతంత్రత అవసరం అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్వయంగా స్టాక్ హోమ్‌లో జరిగిన ఒక సదస్సులో అభిప్రాయపడ్డారు. ప్రాథమిక హక్కులను కాపాడిన కేశవానంద భారతి, సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షించిన ఎస్.ఆర్ బొమ్మై తదితర కేసులను ఆయన ఉటంకించారు. ఈ తీర్పులు చరిత్ర పుటల్లో కెక్కాయి. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు స్వేచ్ఛగా సజావుగా ఎలాంటి బయటి ఒత్తిడి లేకుండా వ్యవహరించేందుకు సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు జోక్యం చేసుకుంది. మరి గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నుంచి ఇలాంటి ఎన్ని అద్భుతమైన తీర్పులు వచ్చాయి? కొన్ని హైకోర్టుల నుంచి కూడా ఇటీవలి కాలంలో మంచి తీర్పులు వచ్చిన ఉదంతాలు లేకపోలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తే నగర బహిష్కారం విధిస్తారా? అని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జె జమ్దార్ ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కాదు, ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపడం, నినాదాలు చేయడం వారి హక్కు అని ఆయన ప్రకటించారు. పోలీసులు ప్రజలకు సేవకులే కానీ ప్రభుత్వానికి కాదని జస్టిస్ మాధవ్ స్పష్టం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ అకౌంట్‌ను బ్లాక్ చేయడాన్ని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు ఆ అకౌంట్‌పై నిషేధం ఎత్తివేయాల్సిందిగా ఆదేశించింది. ‘న్యాయమూర్తులేమీ పవిత్రమైన గోవుల్లాంటి వారు కాదు, వారిలో కూడా అవినీతిపరులు ఉన్నారు’ అని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక న్యాయమూర్తి అవినీతికి పాల్పడిన విషయాన్ని చూపించిన సినిమాను నిషేధించాలని దాఖలైన పిటిషన్‌పై అలా స్పందించింది. విచిత్రమేమంటే న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నందుకు సుప్రీంకోర్టు మూడో కన్ను తెరిచి ఆ పేరాను మార్పించింది. కోర్టుల్లో వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గతంలో చెప్పిన వివరాలను కూడా కొత్త అధ్యాయంలో తీసేశారు. కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభలకు అతీతంగా న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నారు. నిజంగా అలా జరుగుతోందా?

ప్రపంచ జస్టిస్ నివేదిక ప్రకారం, రూల్ ఆఫ్ లా విషయంలో భారతదేశం 86వ స్థానంలో ఉన్నది. అమెరికాకు చెందిన ఒక స్వతంత్ర సంస్థ రూపొందించిన ఆ నివేదిక ప్రకారం, అమెరికాలో కూడా రూల్ ఆఫ్ లా అంత గొప్పగా లేదని, ఆ విషయంలో అది 36వ స్థానంలో ఉన్నదని తేల్చింది. ప్రపంచంలో నాలుగోవంతు దేశాలు నిరంకుశత్వంలోకి జారిపోతున్నాయని అందులో అమెరికా, ఇండియా కూడా ఉన్నాయని స్వీడన్‌కు చెందిన వీడెమ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక తెలిపింది. ఉదారవాద ప్రజాస్వామిక దేశం అన్న గుర్తింపును అమెరికా యాభై ఏళ్ల తరువాత తొలిసారి కోల్పోయిందని ఆ నివేదిక పేర్కొంది. భారత్‌లో పద్ధతి ప్రకారం వ్యవస్థలు కూలిపోతున్నాయని వెల్లడించింది. ప్రభుత్వాలు నిరంకుశంగా మారితే దాని ప్రభావం వ్యవస్థలపై నేరుగా ఉంటుందన్న విషయం వేరే చెప్పనక్కర్లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి గురించి, వెలుపలి శక్తుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల గురించి సిట్టింగ్ న్యాయమూర్తులైన జస్టిస్ నరసింహ, జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ దీపాంకర్ దత్తా తదితరులు పదే పదే హెచ్చరిస్తూనే ఉన్నారు. కోర్టుల స్వతంత్రతకు అతి పెద్ద ముప్పు కోర్టుల నుంచే వస్తోందని ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్ చెప్పారు... ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా ఉన్నదని చెబితే సరిపోదు, అది స్వతంత్రంగా పనిచేస్తున్నట్లు తెలియాలి అని జస్టిస్ దీపాంకర్ దత్తా అన్నారు. మాజీ న్యాయమూర్తుల్లో కూడా ప్రస్తుత పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నవారున్నారు. సమాఖ్య వ్యవస్థ ప్రమాదంలో పడిందని జస్టిస్ కురియన్ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ లేకుండా వేలాది మంది జైళ్లలో మగ్గుతున్నారని జస్టిస్ మదన్ లోకూర్ అంటే, ప్రాథమిక హక్కులను కాపాడే విషయంలో సుప్రీంకోర్టు నిదానంగా వ్యవహరిస్తోందని జస్టిస్ దీపక్ గుప్తా విమర్శించారు. సీనియర్ న్యాయవాదులూ ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు. న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఆగడాల నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నదని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుశ్యంత్ దవే అన్నారు. గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నాయకత్వం దేశాన్ని, న్యాయవ్యవస్థను విఫలం చేసిందని ఆయన ఆరోపించారు. కపిల్ సిబాల్, ప్రశాంత్ భూషణ్, ఇందిరా జైసింగ్, సంజయ్ హెగ్డే తదితరులు కూడా తరచూ న్యాయ వ్యవస్థ దుస్థితిని ఎత్తిచూపుతున్నారు. ఈ దేశంలో ప్రజల కన్నా ప్రభుత్వాలే అభద్రతలో పడ్డట్లు అసహనానికి ఎక్కువగా గురవుతున్నట్లు కనపడుతోంది. పాలనపై దృష్టి కేంద్రీకరించాల్సిన ప్రభుత్వాలు తమ అసహనాన్ని, అభద్రతా భావాన్ని ప్రజలు, వ్యవస్థలపై చూపించినప్పుడే దుష్పరిణామాలు సంభవిస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

# ఏఐను నియంత్రించాల్సిందే!

**కాలగమనంలో వచ్చే ప్రతి వైజ్ఞానిక విప్లవమూ చట్టపరమైన ప్రశ్నలెన్నింటినో లేవనెత్తుతుంది. వాటికి బదులు చెప్పగలిగిన సత్తా పాత శాసనాలకు సహజంగానే ఉండదు. అనూహ్యంగా పురోగమించే ఆధునిక సాంకేతికతలను అర్థం చేసుకుంటూ... ఆవిష్కరణలను స్వాగతిస్తూనే, వాటివల్ల ప్రభావితమయ్యే మానవ హక్కులను పరిరక్షించాలంటే- కొత్త చట్టాలను రూపొందించుకోక తప్పదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి మూలంగా మానవాళి శక్తిసామర్థ్యాలు పెరుగుతున్నకొద్దీ, వాటిని ఎవరూ దుర్వినియోగం చేయకుండా నిరోధించాల్సిన అవసరమూ అధికమవుతుంది. అందుకుగానూ సంబంధిత శాసన చట్రాలను బలోపేతం చేసుకోవాల్సి వస్తుంది. ఊహలూ ప్రయోగాల దశను దాటేసి, దాదాపుగా అన్ని రంగాల్లో కృత్రిమమేధ (ఏఐ) విస్తృతంగా వాడుకలోకి వస్తున్న నేపథ్యంలో దాన్ని న్యాయబద్ధంగా నియంత్రించడానికి ప్రభుత్వపరంగా ప్రత్యేక వ్యవస్థలు ఉండాలన్న చర్చ నేడు ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది. కేంద్ర**



**ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ ఇటీవల పేర్కొన్నట్లు- దేశీయంగానూ ఏఐ నియంత్రణకు విడిగా ఒక చట్టాన్ని పట్టాలకెక్కించాల్సిన సమయం ఆసన్నమైంది!**

ప్రపంచ ఏఐ మానవ వనరుల్లో సుమారు 16శాతం వాటా కలిగిన భారతావనిలో ప్రస్తుతం 87శాతం సంస్థలు ఏదో ఒక రూపంలో కృత్రిమమేధను వాడుతున్నాయి. దేశ జీడీపీలో 17శాతం సంపదను సమకూర్చుతూ 2.7కోట్ల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న తయారీ రంగంలోని కర్మాగారాలు వైఫల్యాల అంచనా, నాణ్యతా నిర్ధారణ, సరఫరాగొలుసుల స్థిరీకరణలకోసం ఏఐను వేగంగా అందిపుచ్చుకుంటున్నాయి. ఏఐ సేవలను అందించడం ద్వారా భారత టెక్నాలజీ కంపెనీలు ఏడాదికి వెయ్యి నుంచి పన్నెండొందల కోట్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, బ్యాంకింగ్, రిటైల్, ఈకామర్స్‌ల నుంచి పౌరసేవల వరకు ఇప్పుడు ప్రతిచోటా ఏఐ ప్రధానపాత్ర పోషిస్తోంది. జనజీవితాలపై ఏదో ఒక రూపంలో ప్రభావం చూపగలిగే నిర్ణయాలను తీసుకునే స్థానంలోకి అది వచ్చేస్తోంది. ఈ క్రమంలోనే అల్గారిథమ్‌ల పక్షపాతాలను నివారించగలమా, ఏఐ వేసే అంచనాలూ చేసే నిర్ధారణలకు ఆధారాలేంటి, వాటివల్ల ఏదైనా హాని సంభవించినప్పుడు పూచీ వహించేవారెవరు, ఏఐ ద్వారా వెల్లువెత్తుతున్న తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్ వీడియోలను ఎలా కట్టడి చేయగలం వంటి అంశాలెన్నో చర్చనీయాంశాలవుతున్నాయి. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఐటీ నిబంధనలు, వ్యక్తిగత సమాచార భద్రతా చట్టం నియమాలు వంటివి ఈ సవాళ్లకు సమగ్ర సమర్థ పరిష్కారాలను చూపించలేవు. అందువల్ల సమకాలీన అవసరాలకు తగినట్లుగా నూతన శాసనానికి రూపకల్పన చేయడం అత్యావశ్యకం!

సమాజానికి ఏఐ వల్ల పొంచిఉన్న ప్రమాదాలను నివారిస్తూనే, దేశాభివృద్ధికి దాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవాలన్నది కేంద్రం తలంపు! అందుకోసం ఏఐ పాలనలో తీసుకురావాల్సిన మార్పుచేర్పులపై అధ్యయనానికి నిరుడు ఒక కమిటీని ఏర్పాటుచేసింది. సమ్మిళిత ప్రగతికోసం నవ్యావిష్కరణలను ప్రోత్సహిస్తూనే జవాబుదారీతనం, నిష్పాక్షికత, భద్రతలకు ప్రాధాన్యమిస్తూ పాలనా చట్రాన్ని నిర్మించుకోవాలని ఆ కమిటీ సిఫార్సు చేసింది. విధాన నిర్ణయాల్లో సమన్వయంకోసం ఏఐ గవర్నెన్స్ గ్రూప్‌ను ఏర్పాటుచేయాలని సూచించింది. జాతీయ ప్రాధాన్యాలు, వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని ప్రభుత్వం ఈ విషయంలో ముందడుగు వేయాలి. చట్టపరమైన అస్పష్టతను తొలగించి బాధ్యతాయుతమైన ఏఐకు బాటలుపరవాలి. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, వ్యక్తిగౌరవం అనే రాజ్యాంగ పునాదులపై నిర్మితమైన భారత ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరిచేందుకు ఏఐ ఒక సాధనం కావాలి తప్ప సామాజిక ఆర్థిక అసమానతలను అది మరింతగా ఎగదోయకూడదు!

# కల్లోల పశ్చిమాసియా!

**అమెరికా–ఇరాన్‌ల మధ్య గతవారం రోజులుగా అడపాదడపా సాగుతున్న దాడులు మంగళవారానికల్లా మరింత ఉగ్రరూపం దాల్చాయి. ఇప్పటికే అమెరికా స్థావరాలపై ఇరాన్ చేసిన దాడులు ఇద్దరు భారతీయ నావికుల ప్రాణాలు తీశాయి. దక్షిణ ఇరాన్‌పై అమెరికా సాగించిన దాడుల్లో 30 మంది పౌరులు, ఏడుగురు సైనికులు మరణించటం, దాదాపు 260 మంది గాయపడటం గమనిస్తే గతానికి మించి ఈసారి పౌర ప్రాంతాలను అమెరికా లక్ష్యంగా చేసుకుందని తెలుస్తుంది. అంతేకాదు... అరుదుగా చేసే పగటిపూట దాడులు కూడా మొదలెట్టింది. ఇరాన్ సైతం అమెరికా మిత్ర దేశాలపై ప్రతీకార దాడులు చేస్తోంది.**

గత నెల 17న ఇరు దేశాలమధ్యా కుదిరిన శాంతి ఒప్పందంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు చిత్తశుద్ధి లేదని అమెరికన్ కాంగ్రెస్‌లోని పాలక, విపక్ష నేతలు గ్రహించారు. యుద్ధం ఎప్పుడో అయిపోయిందని బొంకటం మొదలుకొని కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిందని చెప్పడం వరకూ ట్రంప్ ఒక పథకం ప్రకారం నడిపించారు. తన అధికారాలకు పరిమితులు విధిస్తూ యుద్ధ అధికారాల చట్టంకింద సెనేట్‌లోనూ, ప్రతినిధుల సభలోనూ చేసిన రెండు తీర్మానాలతో బెంబేలెత్తిన ట్రంప్ మొదట యుద్ధం ఎప్పుడో ఆగిందని అబద్ధమాడారు. మరికొన్ని రోజులు గడిచాక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, శాంతి ఒప్పందం దిశగా ఇది తొలి అడుగన్నారు. తీరా ఇప్పుడు మళ్లీ యుద్ధ భేరి మోగించారు.

నిజానికి అమెరికా దాడులు ఆపింది ఎప్పుడూ లేదు. ఏదో వంకతో ఇరాన్‌పై కొనసాగిస్తూనే ఉంది. కేవలం కొంత వ్యవధి గడిచింది గనుకే యుద్ధం మొదలైనట్టు అధికారికంగా కాంగ్రెస్‌కు వర్తమానం పంపారు. పర్యవసానంగా 60 రోజులపాటు మళ్లీ యుద్ధం సాగించవచ్చన్నది ఆయన వ్యూహం. ఇది చెల్లుబాటు కాదనీ, ఈ విషయంలో ట్రంప్ ఇష్టారాజ్యం సాగనివ్వబోమనీ ఇరు పార్టీల ప్రతినిధులూ చెబుతున్నది ఆచరణలో ఎంతవరకూ నెరవేరుతుందో చూడాలి. గ్యాస్ ధరలు అపరిమితంగా పెరగటం, ఇతరేతర సరుకులు సైతం అందుబాటులో లేకపోవటంతో జనం బెంబేలెత్తుతుండగా మరిన్ని దాడులతో ఇరాన్ దారి కొస్తుందని ట్రంప్ కలగంటున్నారు. ఇరాన్‌తో లడాయి మొదలయ్యాక గ్యాస్ కోసం అమెరికా ఇంతవరకూ 5,640 కోట్ల డాలర్లు అదనంగా వెచ్చించిందని డెమాక్రాట్ల ఆధ్వర్యంలోని ఉమ్మడి ఆర్థిక కమిటీ అంచనా వేసింది. తాజా పరిణామాలతో వార్షిక రక్షణ విధాన బిల్లు ప్రవేశించకుండా సెనేట్‌లో 50-46 ఓట్ల తేడాతో నిరోధించటంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారనే చెప్పాలి. సొంత పార్టీకి చెందినవారే అడ్డం తిరగటంతో బిల్లు సభాప్రవేశానికి అవసర మైన 60 ఓట్లు లభించలేదు.

హార్మూజ్ జలసంధి విషయంలో ఏం చేయాలో ట్రంప్‌కు పాలుబోవడం లేదని ఆయన పరస్పర విరుద్ధ ప్రకటనలే చెబుతున్నాయి. ఇకపై హార్మూజ్‌లో నౌకల రాక పోకలు సక్రమంగా జరిగేలా చూడటం తమ బాధ్యతనీ, అందుకు 20 శాతం సుంకం వసూలు చేస్తామనీ ప్రకటించి 24 గంటలు గడవకుండా మాట మార్చారు. దేశదేశాల అధినేతలూ అమెరికాలో వందలకోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామనటంతో నిర్ణయం మారిందట! అమెరికా, దాని మిత్రపక్షాలూ ఎప్పటిలాగే స్వేచ్ఛాయుత హార్మూజ్ కొన సాగాలని కోరుతూ రాగా, ఇప్పుడు అందుకు విరుద్ధమైన ప్రకటన రిపబ్లికన్లను సైతం దిగ్భ్రమపరిచింది. అంతర్జాతీయ జలరవాణా మార్గంపై ఏ దేశమైనా ఎలా పెత్తనం చేస్తుందన్న వారి ప్రశ్నకు ట్రంప్ దగ్గర జవాబు లేదు.

సాధారణ సమయాల్లో హార్మూజ్‌ను రోజుకు 130 రవాణా నౌకలు దాటేవి. అవికాస్తా సోమవారానికి 10కి పడిపోయాయి. తాజా దాడుల తర్వాత అది పూర్తిగా స్తంభించి పోయింది.

# సకాలంలో ఉద్యోగులకు సేవలు అందించాలి

- పర్సనల్, సంక్షేమ విభాగాల పనితీరుపై సమీక్ష
- పారదర్శకత, నిబద్ధతతో పనిచేయాలి: ఏజీఎం ఎస్. రమేష్




**మణుగూరు, జూలై 28, అనంత జనశక్తి న్యూస్**

సింగరేణి మణుగూరు ఏరియాలో పర్సనల్, సంక్షేమ విభాగాల ద్వారా ఉద్యోగులకు అందించే సేవలను సకాలంలో పూర్తి చేయాలని అడిషనల్ జనరల్ మేనేజర్ (పర్సనల్) ఎస్. రమేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏరియా పర్సనల్, సంక్షేమ అధికారులు, పీఓఏలు, వివిధ విభాగాల మినిస్టీరియల్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో గైర్హాజరైన కార్మికులకు సంబంధించిన చార్జిషీట్ విచారణల పురోగతిని సమీక్షించారు. ఇతర కారణాలతో చార్జిషీట్లు పొందిన ఉద్యోగుల విచారణలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని విచారణ అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకాలకు సంబంధించిన క్లెయిమ్‌లపై మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన వివరాలను నిర్ణీత సమయంలో పీఐఓలకు అందించాలని, కోర్టు కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో నవీకరించాలని తెలిపారు.

ఉద్యోగులకు కార్పొరేట్ శాలరీ ఖాతాలు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు పదవీ విరమణ ప్రయోజనాలు, సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ, సీపీఆర్ఎంఎస్ తదితర క్లెయిమ్‌లకు అవసరమైన పత్రాలను సేకరించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. క్వార్టర్ల కేటాయింపు, పీనల్ రెంట్, హెచ్ఆర్ఏ వివరాలను డిజిటలైజ్ చేయాలని సూచించారు. అర్హులైన ఉద్యోగులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం క్యాడర్ స్కీమ్ ప్రమోషన్లు అందించాలని, సీఎంపీఎఫ్, ఎంప్లాయి పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఈపీఐఎస్) పోర్టళ్ల వినియోగంపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సీఎంపీఎఫ్ నంబర్లను త్వరగా కేటాయించాలని ఆదేశించారు. వైద్య పుస్తకాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసేందుకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ వివరాలను సేకరించి ఎస్ఏపీలో నమోదు చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. పర్సనల్, సంక్షేమ విభాగాల అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది మరింత నిబద్ధతతో, పారదర్శకంగా సేవలు అందించాలని ఎస్. రమేష్ సూచించారు.

సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి. శ్యామ్ ప్రసాద్, సీనియర్ పీఓలు కె. శ్రీనివాస్, వి. రామేశ్వర రావు, డి. నరేష్, సంక్షేమ అధికారులు చంద్రకిరణ్, వంశీకృష్ణ, సాయి మౌనిక, డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం. నరసింహారావు, మధు, ఎండీ షాబుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ సుభాని, శిల్ప, శ్రియ, వినయ్‌తో పాటు వివిధ విభాగాల మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ–రెవెన్యూ భూ సమస్యలకు జాయింట్ సర్వేతో పరిష్కారం

- గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు తొలి ప్రాధాన్యం
- పెండింగ్ అటవీ అనుమతులను వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూలై 28, అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో అటవీ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన భూ సమస్యలను కేటగిరీల వారీగా వర్గీకరించి, అత్యంత ప్రాధాన్యత కలిగిన వాటిని ముందుగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే అంశాలను ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ సమావేశం నిర్వహించారు. అటవీ-రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూములు, అటవీ అనుమతులు, జాయింట్ సర్వే, ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తులు, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యాటక అభివృద్ధి, వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగుపల్లి, లచ్చగూడెం, పాల్వంచ, ఉప్పుసాక, కరకగూడెం ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను జాయింట్ సర్వే ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో బోర్‌వెల్లు, గ్రావెల్ రోడ్లు, రహదారులు, తాగునీటి పథకాలు, విద్యుత్, వైద్య, విద్యా సదుపాయాలకు సంబంధించిన అటవీ అనుమతులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, గతేడాది సగటున 6 మీటర్లలో ఉన్న భూగర్భ జలమట్టం ప్రస్తుతం 9 మీటర్లకు పడిపోయిందని తెలిపారు. తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్లు, మిషన్ భగీరథ, ఇతర తాగునీటి పథకాలకు అవసరమైన అనుమతులను అత్యవసర ప్రాతిపదికన మంజూరు చేయాలని సూచించారు.

ఇందిరమ్మ గృహాల విషయంలో ఇప్పటికే గృహాలు ఉండి అదే స్థలంలో పునర్నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు నిబంధనల మేరకు అవసరమైన అటవీ అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. కొత్తగా అటవీ భూముల్లో గృహ నిర్మాణాలను ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాలకు రహదారులు, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన అనుమతులను ఆలస్యం చేయరాదన్నారు. కొత్తగా అడవులను నరికివేసి పోడు సాగు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, దీర్ఘకాలంగా పోడు సాగు చేస్తున్న గిరిజన రైతుల సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ విస్తరణకు సంబంధించిన అటవీ అనుమతులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నందున సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు.

వన్యప్రాణుల వేటపై కఠిన చర్యలు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ అటవీ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. అటవీ అధికారులు పోడు ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీసు శాఖకు సమాచారం అందిస్తే అవసరమైన భద్రత కల్పిస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలో అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు.

వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ములకలపల్లి, దమ్మపేట, దుమ్ముగూడెం ప్రాంతాల్లో వన్యప్రాణుల వేటకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. 2017 నుంచి జిల్లాలో గంజాయి సాగుకు సంబంధించిన కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. 860 ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తులు పెండింగ్ జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.10 లక్షల ఎకరాల అటవీ విస్తీర్ణం ఉందని తెలిపారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కొత్తగా అడవులను నరికివేయకుండా చర్యలు చేపడుతూనే పోడు వ్యవసాయానికి సంబంధించిన డివిజన్‌వారీ వివరాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నకిలీ ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసే వారిపై అవసరమైతే పీడీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవి అంటే కేవలం చెట్లు మాత్రమే కాదని, వన్యప్రాణులు కూడా అటవీ సంపదలో భాగమని పేర్కొన్నారు. ఆర్ఓఎఫ్ఆర్‌కు సంబంధించిన 860 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చట్టబద్ధంగా పరిష్కరిస్తామని తెలిపారు. కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. నాలుగు నెలల్లో పెండింగ్ అటవీ అనుమతుల దరఖాస్తులను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. భద్రాచలంలోని 'భద్రగిరి మార్ట్' తరహాలో అటవీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖలకు సంబంధించిన ఫారంబీ అనుమతులు సకాలంలో అందకపోవడంతో సుమారు 20 ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోడు వ్యవసాయానికి సంబంధించి సుమారు 1,800 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. గుత్తికోయ ఆవాసాలకు విద్యుదీకరణ కల్పించేందుకు అవసరమైన అటవీ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ బూర్గంపాడు ప్రాంతంలో అటవీ-రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వేను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న అటవీ-రెవెన్యూ కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్లు, అటవీ, పోలీసు శాఖల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు శాశ్వత పరిష్కారం





(మొదటి పేజీ తరువాయి)

దీంతో పాటు రైతుల సొంత భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న సాగుభూముల పునరుద్ధరణ పనులకు ఉపాధి హామీ పథకంలో అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కూడా ఈ పథకం జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగమయ్యే లబ్ధిదారులకు కనీసం 90 రోజుల పాటు పని కల్పించి, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవచ్చని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సమగ్రంగా వివరించారు.

**ఏపీలో రూ.10 వేల కోట్ల బకాయిలు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, అక్కడ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం నూటికి నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించిన తర్వాతే తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు వారికి ఉంటుందని స్పష్టం చేశారు. 'నవ్వితే నాకేటి సిగ్గు' అన్నట్లుగా బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని, బీఆర్ఎస్‌కు వంతపాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వ నిర్వాకమే నేటి ఆర్థిక భారం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఎగవేతల వల్లే ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశం నేడు పెద్ద ఆర్థిక భారంగా మారిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం ఏకంగా రూ. 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెట్టి వెళ్లిందని ఆయన గుర్తుచేశారు. ఆనాడు ఈ బకాయిలపై మాట్లాడని నేతలు, నేడు రాజకీయ లబ్ధి కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్ కృష్ణయ్య, కిషన్ రెడ్డి వంటి నేతలు ఏపీలోని బకాయిలపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు.

**ఏ ఏడాది బకాయిలు ఆ ఏడాదే చెల్లిస్తాం!**

ఇకపై ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు, కళాశాలల యజమాన్యాలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యే లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును ఏ ఏడాదిది ఆ ఏడాదే క్రమం తప్పకుండా చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీనికోసం ముందస్తుగా (అడ్వాన్స్‌గా) బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని వెల్లడించారు. ఈ పథకం అమలు కోసం సంవత్సరానికి దాదాపు రూ. 2,400 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని వివరించారు.

**టీజీపీఎస్సీలో పారదర్శకత.. యూపీఎస్సీ తరహా నిర్వహణ**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనితీరుపై మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, కమిషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోకుండా ప్రతి పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో 'గ్లోబరీనా' వంటి వివాదాస్పద సంస్థపై అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్లే సిబిఎస్ఈలో సైతం అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం నిరుద్యోగుల ప్రయోజనాలే పరమావధిగా కట్టుదిట్టమైన పద్ధతుల్లో నియామక ప్రక్రియలను కొనసాగిస్తుందని పునరుద్ఘాటించారు.

## ఉరవకొండలో అక్రమాలపై ఈ నెల 31న మహాధర్నా



- బీజేపీ జిల్లా అధ్యక్షుడు టీడీపీకి బినామీగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతల ఆరోపణ

**అనంతపురం, జూలై 28:అనంత జనశక్తి న్యూస్**

ఉరవకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, భూ దందాలు, హంద్రీ-నీవా కాలువ పనుల్లో అవకతవకలు, రైతుల సమస్యలపై ఈ నెల 31న ఎమ్మార్వో కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. అనంతపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కేవీ రమణ మాట్లాడుతూ, ఉరవకొండలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తెలుగుదేశం పార్టీ, ముఖ్యంగా మంత్రి పయ్యావుల కేశవ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హంద్రీ-నీవా కాలువ పనుల్లో అవకతవకలు, నాణ్యతలేని పనులు, టెండర్లలో అక్రమాలు, రైతులకు సాగునీటి సమస్యలు, భూ వివాదాలపై సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామంలోని సర్వే నంబర్ 141 భూమికి సంబంధించిన వివాదంలో ప్రభుత్వం, అధికారులు, బీజేపీ నాయకులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై న్యాయస్థాన ఆదేశాలను కూడా గౌరవించాలని కోరారు. ఉరవకొండ నియోజకవర్గంలో భూ దందాలు, బెల్ట్ షాపులు, పేకాట కేంద్రాలు, ప్రజలపై దౌర్జన్యాలు పెరిగాయని ఆరోపించిన వారు, వీటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ పీపీ, సీనియర్ న్యాయవాది హరినాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కురుబ దేవేంద్ర, కదదరకుంట నాయకుడు కురుబ రామచంద్ర, మాజీ డైరెక్టర్ కురుబ కార్పొరేషన్ కురుబ గోవిందు, బీసీ సెల్ ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కురుబ సురేష్, బీసీ సెల్ నాయకుడు బెస్త తిరుపాల్ పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ ఎక్కడ..? గుక్కెడు నీటికీ నోచని వీరభద్రపురం

- పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం.
- ఖాళీ బిందెలతో సచివాలయం ముట్టడికి హెచ్చరిక.
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న గ్రామస్తులు.
- మధ్యలోనే ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పనులు.



**అనంతగిరి జూలై 28 ,అనంత జనశక్తి, న్యూస్**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలోని వీరభద్రపురం గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు మంచినీటి కోసం ఆదివాసీ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీటి సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు, మహిళలు ఆరోపించారు. వెంటనే స్పందించి గ్రామానికి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే గ్రామ మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో సచివాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే ఐదేళ్ల క్రితం జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభించిన పైప్‌లైన్ పనులను మధ్యలోనే నిలిపివేశారని, దీంతో గ్రామ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని వాపోయారు. ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించిన గ్రామస్తులు, సమస్యకు వెంటనే పరిష్కారం చూపకపోతే శుక్రవారం నిర్వహించే పీజీఆర్ఎస్ (స్పందన) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మానిటరింగ్ అధికారులు

**నల్లచెరువు జులై 28 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు పిహెచ్సి నల్లచెరువు ప్రధాన ఆరోగ్య ఉప కేంద్రము మరియు ఎం అగ్రహారం ఆరోగ్య ఉపకేంద్రాలను జిల్లా మానిటరింగ్ అధికారులు జిల్లా ఎన్ హెచ్ ఎం అధికారి నాగరాజు మరియు జిల్లా నర్సింగ్ అధికారి వీరమ్మ మరియు జిల్లా సామాజిక అధికారి వన్నప్ప పీహెచ్సీ పరిధిలోని నల్లచెరువు ఉపకేంద్రం మరియు ఎం అగ్రహారం ఉపకేంద్రంలోని రికార్డులను సమగ్రంగా పరిశీలించి రికార్డులను పరిశీలించారు అందులో భాగంగా మాతా శిశు రికార్డులు వ్యాధి నిరోధక టీకాల రికార్డులు, వెల్నెస్ సెంటర్ లోని ఓపి రికార్డులు ఈ సంజీవని రికార్డులు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించారు రికార్డులోని కొన్ని లోపాలను సిబ్బందికి తెలియజేసి వాటిని సక్రమంగా చేసుకోవాలని తెలియజేసారు ఈ కార్యక్రమంలో పి హెచ్సి వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య సి హెచ్ ఓ రామచంద్రారెడ్డి సూపర్వైజర్లు రెడ్డమ్మ సుధాకర్ ఏఎన్ఎంలు యోగేశ్వరి సరస్వతి ఎం ఎల్ హెచ్ పి లు శ్రావణి హెల్త్ అసిస్టెంట్ ముస్తఫా లక్ష్మీనారాయణ సూర్యనారాయణ రెడ్డి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**తలుపుల జులై 28(అనంత జనశక్తి న్యూస్)**

మండల పరిధిలోని బత్రేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త శ్రీ కోటే విరమనాయుడు, వేపమానిపేటకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త బయరెడ్డి అకాల మరణం చెందడంతో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ వారి నివాసాలకు వెళ్లి పార్థివదేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ప్రగాఢ దుఃఖంలో తాను భాగస్వామినని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం నిస్వార్థంగా సేవలందించిన కోటే విరమనాయుడు, బయరెడ్డి సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్మరించుకున్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.





## బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

- గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వే ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ
- ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1,000 స్టైఫండ్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జులై 28, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు 125 రోజుల ఉచిత కోచింగ్ అందించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ తెలిపారు. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4తో పాటు ఎస్ఎస్సీ, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్, ఈబీసీ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అర్హులైన అభ్యర్థులు 2026 ఆగస్టు 14 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఆగస్టు 18న అర్హుల జాబితా ప్రకటించి, ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. ఆగస్టు 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. 202627 ఆర్థిక సంవత్సరానికి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు. రెగ్యులర్ కోర్సులు చదువుతున్న వారు ఈ శిక్షణకు అర్హులు కారు. ప్రతి నెల 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు మూడు నెలల పాటు నెలకు రూ.1,000 చొప్పున స్టైఫండ్ అందిస్తారు. అర్హులైన అభ్యర్థులు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 08742227427, 9441911359, 9059793456 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## ఆదివాసీ చట్టాలకు ద్రోహం చేస్తే ఊరుకోం

- 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ హక్కులను కాపాడాలి
- తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జులై 28, అనంత జనశక్తి న్యూస్

భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి డిమాండ్ చేశారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే చర్యలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు. ''దమ్ముంటే 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ పరిధిలో సెంటు భూమి కొనుగోలు చేసి చూడండి. ఆదివాసీల హక్కుల కోసం మా పోరాటం ఏమిటో చూపిస్తాం'' అని అలెం కోటి పేర్కొన్నారు. గిరిజ నేతరులతో కోర్టుల్లో కేసులు వేయిస్తూ, మరోవైపు విలేకరుల సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిరిజన ఎమ్మెల్యేలను అడ్డుపెట్టుకొని 'జల్, జంగల్, జమీన్'పై ఆదివాసీలకు ఉన్న హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాంట్రాక్టులు, సీఎస్ఆర్ నిధుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతానికి అధికారులు రావాలన్నా రాజకీయ నాయకుల అనుమతి అవసరమనే పరిస్థితి ఉండకూడదన్నారు. గవర్నర్, రాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు, జీవోలు పకడ్బందీగా అమలు కావాలని కోరారు.

గోదావరి ఇసుక ర్యాంపుల కాంట్రాక్టులను ఇతర ప్రాంతాలకు చెందిన వారికి అప్పగిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారాల్లో ఆదివాసీల ప్రయోజనాలను విస్మరించవద్దని డిమాండ్ చేశారు. ఆదివాసీలు అమాయకులని భావించి వారి సహజ సంపదను దోచుకునే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీల 'జల్, జంగల్, జమీన్'తో పాటు సహజ వనరులు, హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని అలెం కోటి హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం

హైదరాబాద్, జులై 28, అనంత జనశక్తి న్యూస్

గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF), జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.



# డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలపై ఎస్పీ సమీక్ష

- సైబర్ నేరాల బాధితులకు సత్వర న్యాయానికి కృషి

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జులై 28, అనంత జనశక్తి న్యూస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీ కోర్, సైబర్ సెల్ విభాగాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సందర్శించి డిజిటల్ పోలీసింగ్‌కు సంబంధించిన కీలక వ్యవస్థల పనితీరు, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీటీఎన్ఎస్, ఈసాక్ష్య, సీఈఐఆర్ పోర్టల్, నాట్‌గ్రిడ్ వ్యవస్థలను నిర్వహిస్తున్న సిబ్బందితో విడివిడిగా సమావేశమై ఆయా విభాగాల పనితీరు, పెండింగ్ అంశాలు, సాంకేతిక సమస్యలు, డేటా నమోదు, సేవల అమలుపై సమీక్షించారు. కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, కేసుల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల గుర్తింపు, బ్లాక్ చేయడం, రికవరీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నాట్‌గ్రిడ్/గాండీవా వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగిస్తూ సమాచార విశ్లేషణ ద్వారా నేరాల నియంత్రణ, దర్యాప్తులో మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణ స్పందన, బాధితుల డబ్బు రికవరీ, పెండింగ్ కేసుల వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. జీఆర్ఎం, ఎంఆర్ఎం, సమన్వయ, సహాయోగ్ పోర్టళ్లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రజలకు డిజిటల్ అరెస్ట్, సైబర్ మోసాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, దర్యాప్తు నాణ్యతను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన కేసుల్లో బీఎన్ఎస్ సెక్షన్ 111 అమలు చేయాలని, అధికారులు, సిబ్బంది నిరంతరం సాంకేతిక శిక్షణ పొందుతూ సైబర్ నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అన్ని విభాగాల సిబ్బంది డేటా భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, అధికారిక సమాచారాన్ని గోప్యంగా భద్రపరుస్తూ సైబర్ భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఐటి కోర్ ఎస్సై గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతునేస్తం 100వ ఎపిసోడ్ విజయవంతం

- వర్షా భావ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి
- శాస్త్రవేత్తల సూచనలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి
- పూసగూడెంలో రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించిన కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జులై 28, అనంత జనశక్తి న్యూస్



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమం మంగళవారం 100వ ఎపిసోడ్‌ను పూర్తి చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించగా, సుమారు మూడు లక్షల మంది రైతులు వర్చువల్‌గా పాల్గొని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను తెలుసుకున్నారు. 100వ ఎపిసోడ్ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు అనుసరించాల్సిన వ్యవసాయ వ్యూహాలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ, చీడపీడల సమగ్ర యాజమాన్యం, పోషక నిర్వహణ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసగూడెం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను రైతులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. నీటి వినియోగంలో పొదుపు పాటిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకుని మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు.

గత రెండున్నర సంవత్సరాలుగా నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమం రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడంలో సమర్థవంతమైన వేదికగా నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. పంటల సాగుకు సంబంధించిన సందేహాలకు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి సమాధానాలు పొందడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందన్నారు. 'రైతునేస్తం' 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అత్యధికసార్లు వీక్షించిన ముగ్గురు రైతులతో పాటు చురుకుగా పాల్గొని ప్రతిభ కనబరిచిన ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులను కలెక్టర్ అంకిత్ జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# కాలం లేక.. రైతుల గోస!

- వరుణుడి కోసం అన్నదాత ఎదురుచూపులు
- వరి సాగుపైనే రైతుల మక్కువ
- ఆరుతడి పంటల వైపు మళ్లాలంటున్న అధికారులు
- వర్షం ఆలస్యమైతే సాగుపై మరింత ప్రభావం
- ప్రత్యామ్నాయ ప్రణాళికే రైతుకు భరోసా

తెలంగాణ బ్యూరో, అనంత జనశక్తి న్యూస్ :





తెలంగాణలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వానాకాలం సాగుకు సిద్ధమైన అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో పలు ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఆశించినంత వేగంగా సాగడం లేదు. విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్న రైతులు అదును కోసం ఎదురు చూస్తున్నారు. వర్షం ఎప్పుడు కురుస్తుందోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. తెలంగాణలో ప్రధానంగా వరి సాగుకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాలతో పాటు వర్షాధార ప్రాంతాల్లోనూ వరి సాగుపై ఆసక్తి ఎక్కువగానే ఉంటుంది. అయితే వర్షాలు ఆలస్యమైతే వరి నాట్లు, పంట కాలంపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. భూగర్భ జలాలపై ఆధారపడి సాగు చేయాలన్నా నీటి లభ్యత కీలకంగా మారుతుంది. దీంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించాలని చెబుతున్నారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా నీటి కొరత ప్రభావాన్ని తగ్గించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. అయితే సంప్రదాయంగా వరి సాగుకు అలవాటు పడిన రైతులు ఒక్కసారిగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడం అంత సులభం కాదు. మార్కెటింగ్, గిట్టుబాటు ధర, దిగుబడి వంటి అంశాలపై రైతుల్లో అనేక సందేహాలు ఉన్నాయి. పంట మార్చాలంటే సాగు విధానంతో పాటు మార్కెట్‌పై రైతుకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. పండించిన పంటకు కొనుగోలు అవకాశాలు ఉంటాయనే నమ్మకం కలిగితేనే ప్రత్యామ్నాయ సాగుపై ఆసక్తి పెరుగుతుంది. అందుకు వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో రైతులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఏ నేలలో ఏ పంట వేయాలి, ఎంత నీరు అవసరం, మార్కెట్ అవకాశాలు ఎలా ఉంటాయన్న విషయాలను వివరించాలి. గ్రామాల వారీగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట ప్రణాళికలు రూపొందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మరోవైపు వర్షాలు ఆలస్యమవుతున్న పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యం పెరిగింది. చెరువులు, కుంటలు, ఫారం పాండ్లు, ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టాల్సిన అవసరం ఉంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించే చర్యలను గ్రామస్థాయిలోనే చేపట్టాలి. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను పంటలకు సమర్థంగా వినియోగించే విధానాలను ప్రోత్సహించాలి. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే వ్యవసాయంతో పాటు పశుగ్రాసం, తాగునీటి లభ్యతపైనా ప్రభావం పడే అవకాశముంది. అందుకే ముందస్తు ప్రణాళిక ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి. విత్తనాల ఎంపిక నుంచి పంటల మార్పు వరకు శాస్త్రీయ సలహాలు అందించాలి. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలి. ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ భరోసా కల్పించే దిశగా చర్యలు అవసరం. కాలం కలిసి వస్తేనే రైతు కష్టం ఫలిస్తుంది. కానీ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాల్లోనూ మార్పు తప్పనిసరిగా కనిపిస్తోంది. ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో రైతుకు అండగా నిలిస్తే నష్టాల తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుంది. అన్నదాతకు ఇప్పుడు కావాల్సింది ఆకాశం నుంచి వాన.. పాలకుల నుంచి భరోసా మాత్రమే.

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో 'రైతునేస్తం'

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తం

హైదరాబాద్, జులై 28, అనంత జనశక్తి న్యూస్



రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు శాస్త్రవేత్త అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టిసారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.



# గుండెపోటు సైలెంట్‌గా వస్తుందా? ఫిట్‌గా ఉన్న వారికీ ప్రమాదమే: కార్డియాక్ సర్జన్ హెచ్చరిక


క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ అంచనాల ప్రకారం, నమోదయ్యే మొత్తం గుండెపోట్లలో 22 శాతం నుంచి 60 శాతం వరకు సైలెంట్ గుండెపోట్లే ఉంటాయి. అంతేకాకుండా, మహిళల్లో, మధుమేహం ఉన్నవారిలో ఇవి ఎక్కువగా వస్తాయి. కానీ, అసలు సైలెంట్ గుండెపోటు అంటే ఏమిటి? బయటికి ఆరోగ్యంగా కనిపించే వారిని కూడా ఇది ఎందుకు ప్రభావితం చేస్తుంది?



"సాధారణంగా గుండెపోటు అంటే ఛాతీ పట్టుకుని నొప్పితో బాధపడే దృశ్యాలు మనకు గుర్తుకొస్తాయి. కానీ, సైలెంట్ గుండెపోటు ఎటువంటి స్పష్టమైన సూచనలు లేకుండా లేదా చాలా తక్కువ లక్షణాలతో వస్తుంది. వైద్యపరంగా దీనిని 'సైలెంట్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్' అని పిలుస్తారు. ఇది సాధారణ గుండెపోటు లాగే గుండె కండరాలను దెబ్బతీస్తుంది. కానీ, చాలా కాలం వరకు గుర్తించలేం." అని డాక్టర్ హిరేమఠ్ అన్నారు. కొన్నిసార్లు, లక్షణాలు చాలా తేలికపాటివిగా లేదా అసాధారణంగా ఉండటం వల్ల వాటిని అలసట, ఎసిడిటీ, గ్యాస్ సమస్యలు లేదా కండరాల నొప్పిగా పొరపాటు పడతారని ఆయన అన్నారు.

యువకులు, ఫిట్‌గా ఉన్నవారు కూడా ఎందుకు సురక్షితం కాదు?

డాక్టర్ హిరేమఠ్ ప్రకారం, గుండె జబ్బు ఉన్నవారిని ఊబకాయులు, శారీరక శ్రమ లేనివారు లేదా వృద్ధులు అనే పాత అభిప్రాయం ఇప్పుడు మారిపోయింది. "శారీరకంగా ఆరోగ్యంగా, చురుకైన జీవనశైలి ఉన్న చాలా మంది యువకులు కూడా ఇప్పుడు గుండె





జబ్బుల బారిన పడుతున్నారు. ఒత్తిడితో కూడిన పని వాతావరణాలు, క్రమరహిత నిద్ర విధానాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ధూమపానం, మద్యపానం, సరైన గుండె పరీక్షలు లేకుండా చేసే అధిక జిమ్ వ్యాయామాలు అన్నీ ఈ సమస్యకు కారణమవుతున్నాయి" అని డాక్టర్ హిరేమఠ్ వివరించారు.

"మరో ముఖ్యమైన ప్రమాద కారకం జన్యుపరమైనది. సాధారణంగా, భారతీయులకు చిన్న కరోనరీ ధమనులు ఉండటం, మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలు ఎక్కువగా ఉండటం వల్ల చిన్న వయసులోనే గుండె జబ్బులు వచ్చే అవకాశం జన్యుపరంగా ఎక్కువ. కాబట్టి, ఎవరైనా బయటికి ఫిట్‌గా కనిపించినా, వారి శరీరంలో సైలెంట్ ప్రమాద కారకాలను కలిగి ఉండవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

మీరు అస్సలు విస్మరించకూడని హెచ్చరిక సంకేతాలు!

సైలెంట్ గుండెపోటుల విషయంలో కష్టమైన విషయం ఏమిటంటే, వాటికి సాధారణ గుండెపోటు లక్షణాలు ఉండవు. "కానీ కొన్ని సూక్ష్మమైన సంకేతాలు ఉండవచ్చు. అవి: ఛాతీలో తేలికపాటి అసౌకర్యం, వ్యాయామం చేసేటప్పుడు ఆయాసం, వివరించలేని అలసట, దవడ, మెడ లేదా చేతులలో నొప్పి, కళ్ళు తిరగడం లేదా అజీర్ణం లాంటి అసౌకర్యం – వీటిని తరచుగా విస్మరిస్తాం. లేదా ప్రమాదకరం కానివిగా తప్పుగా అర్థం చేసుకుంటాం" అని డాక్టర్ హిరేమఠ్ అన్నారు.

"బక్కగా ఉన్నా లేదా రోజూ జిమ్‌కు వెళ్ళినా గుండె సంబంధిత సమస్యల నుండి తమను తాము రక్షించుకుంటామని చాలామంది అనుకుంటారు. కానీ శారీరక రూపం లేదా శరీరాకృతి ఎల్లప్పుడూ ధమనుల లోపల ఏమి జరుగుతుందో ప్రతిబింబించదు" అని ఆయన అన్నారు.

రెగ్యులర్ గుండె పరీక్షలు చాలా ముఖ్యం

డాక్టర్ హిరేమఠ్ గారి ప్రకారం, మీరు యువకులైతే, ఎటువంటి లక్షణాలు లేకపోయినా, వార్షిక ఆరోగ్య పరీక్షలు — ECG (ఎలక్ట్రో కార్డియోగ్రామ్), కొలెస్ట్రాల్ పరీక్షలు, రక్తపోటు, అవసరమైతే స్ట్రెస్ టెస్ట్ — చేయించుకోవడం వల్ల ప్రారంభ హెచ్చరిక సంకేతాలను గుర్తించవచ్చు. "కుటుంబంలో గుండె జబ్బులు, మధుమేహం లేదా అధిక రక్తపోటు చరిత్ర ఉన్న వ్యక్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే, ఫిట్‌నెస్ అనేది సమగ్రంగా ఉండాలి – ఇందులో క్రమం తప్పకుండా వ్యాయామం, జిమ్, సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ ఉండాలి. వైద్యుల అనుమతి లేకుండా అతిగా వ్యాయామం చేయడం లేదా విపరీతమైన డైటింగ్ చేయడం మంచి కంటే హాని ఎక్కువ చేయవచ్చు" అని వారు సూచించారు.


సురక్షితంగా ఉండటానికి ఏం చేయాలి?

ముప్పు గురించి తెలుసుకోవడం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా సైలెంట్ గుండెపోటు వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని డాక్టర్ హిరేమఠ్ చెప్పారు.

చిన్న, స్థిరమైన జీవనశైలి మార్పులతో ప్రారంభించమని వారు సూచించారు. "ధూమపానం మానేయండి. ప్రాసెస్ చేసిన ఆహారం, చక్కెరను తగ్గించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి.

# గొంతులో 'బ్లేడ్‌లు' పెట్టినట్లు కోస్తుంది.. కొత్త కోవిడ్ వేరియంట్ లక్షణాల్లో ఇదొకటి





ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పుడు ఒక కొత్త కోవిడ్-19 వేరియంట్‌పై నిశితంగా దృష్టి పెట్టింది. గతంలో వచ్చిన మ్యుటేషన్‌ల కంటే ఇది మరింత వేగంగా వ్యాప్తి చెందుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త వేరియంట్ సోకిన వారికి గొంతులో 'రేజర్ బ్లేడ్‌లు' పెట్టినట్లుగా తీవ్రమైన నొప్పి కలుగుతుందని సమాచారం.

'నింబస్' వేరియంట్ అంటే ఏమిటి?

NB.1.8.1 అనే ఈ వేరియంట్‌కు అనధికారికంగా 'నింబస్' అని పేరు పెట్టారు. ఇది ఓమిక్రాన్ వేరియంట్ కుటుంబానికి చెందినది. WHO దీన్ని 'వేరియంట్ అండర్ మానిటరింగ్ (VUM)'గా వర్గీకరించింది. జూన్ 11 నాటి సలోన్ నివేదిక ప్రకారం, ఆసియాలో నమోదవుతున్న కోవిడ్ కేసులలో 10 శాతానికి పైగా ఈ నింబస్ వేరియంట్ కేసులే ఉన్నాయట. అంతేకాదు, ఈ వేరియంట్ ఇప్పటికే అమెరికా, కెనడా వంటి పలు దేశాలలో కూడా గుర్తించినట్లు సలోన్ వెల్లడించింది.

NB.1.8.1 వేరియంట్ లక్షణాలు ఏమిటి?

ఈ నింబస్ వేరియంట్ సోకిన వారిలో ప్రధానంగా "రేజర్ బ్లేడ్ థ్రోట్" లేదా తీవ్రమైన గొంతు నొప్పి ఉంటుందని సలోన్ నివేదించింది. ఇతర లక్షణాలలో సాధారణ ఫ్లూ లక్షణాలు కూడా ఉంటాయి. వాటిలో..

ముక్కు దిబ్బడ
అలసట
తేలికపాటి దగ్గు
జ్వరం
కండరాల నొప్పి
అరుదుగా విరేచనాలు, వికారం వంటివి కూడా ఉండవచ్చు.

అయితే, WHO ప్రస్తుతానికి ప్రపంచవ్యాప్తంగా ఈ వేరియంట్ వల్ల కలిగే ప్రమాదం "తక్కువగా" ఉందని







చెబుతోంది. ఇప్పటికే ఉన్న కోవిడ్-19 వ్యాక్సిన్‌లు తీవ్రమైన వ్యాధిని నివారించడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అభిప్రాయపడింది.


## NB.1.8.1 గురించి మరిన్ని వివరాలు:

నింబస్ వేరియంట్ ఇతర కోవిడ్ స్ట్రెయిన్‌ల నుండి మూడుసార్లు జన్యు పదార్థాన్ని పునఃకలయిక చేసుకుందని సలోన్ తెలిపింది. నిజానికి, వైరస్‌లు మనుగడ సాగించడానికి, అభివృద్ధి చెందడానికి పునఃకలయిక ఒక సహజ ప్రక్రియే. అయితే, వైరస్ ఇలా ప్రతిసారీ పునఃకలయిక చేసుకున్నప్పుడు, అది మరింత వేగంగా వ్యాప్తి చెందే లేదా మరింత తీవ్రమైన వ్యాధిని కలిగించే సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చెందాలా?

అర్కాన్సాస్‌లోని న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్ డాక్టర్ రాజేంద్రం రాజనారాయణన్ సలోన్ పోర్టల్‌తో మాట్లాడుతూ, నింబస్‌లో ఒక మ్యుటేషన్ ఉండటం వల్ల గతంలో సంక్రమణల ద్వారా మనం పొందిన రోగనిరోధక శక్తిని ఇది తప్పించుకోగలదని, కాబట్టి వ్యాప్తి కొద్దిగా ఎక్కువగా ఉండవచ్చని తెలిపారు. అత్యవసర విభాగాల్లో పెద్దగా కేసులు పెరిగినట్లు గమనించలేదని, వేచి చూడాలని అన్నారు.

కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ గ్వెల్ఫ్ పరిశోధకుడు, జీనోమ్ జీవశాస్త్రవేత్త డాక్టర్ టి. ర్యాన్ గ్రెగొరీ మాట్లాడుతూ, "ఓమిక్రాన్ నుండి మనం నేర్చుకున్నది ఏమిటంటే, అధిక వ్యాప్తి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. ఈ సమయంలో తీవ్రమైన అనారోగ్యం మాత్రమే కాదు, పదే పదే వచ్చే ఇన్ఫెక్షన్ల దీర్ఘకాలిక ప్రభావాల గురించి కూడా ఆందోళన చెందాలి" అని అన్నారు. అలాంటి ప్రభావాలలో 'లాంగ్ కోవిడ్' వంటి పరిస్థితులు ఉంటాయి. ఇందులో కోవిడ్-19 లక్షణాలు నెలలు లేదా సంవత్సరాల తరబడి కొనసాగుతాయి. తరచుగా రోగులను బలహీనపరుస్తాయి.



అనంత
జనశక్తి
బుధవారం | రంగారెడ్డి
29.07.2026



# వీరనారి బెలవాడీ_ _ _ మల్లమ్మగా.. భూమి

హిందీ చిత్రపరిశ్రమలో విభిన్నమైన పాత్రలతో తమకంటూ గుర్తింపు తెచ్చుకున్న కథానాయికల్లో ముందు వరసలో ఉంటుంది భూమి పెడ్నేకర్. ఏడాది ఆరంభంలోనే పోలీసు అధికారిణిగా 'దల్దాల్' సిరీస్‌తో ప్రేక్షకుల్ని అలరించిన ఆమె తదుపరి ప్రాజెక్ట్ విషయంలో ఇంకా ఎలాంటి కొత్త కబురు వినిపించనే లేదు. అయితే తాజాగా ఆమె పాన్ ఇండియా స్థాయిలో కథానాయకుడు రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో రూపొందనున్న 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' సినిమాలో నటిస్తున్నట్లు దర్శకుడు సందీప్ సింగ్ ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నారు. ఈ సందర్భంగా భూమి ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. "గొప్ప మరాఠా యోధ రాజు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, వారసత్వంపై రూపొందుతున్న ఇలాంటి భారీ చిత్రంలో భాగం కావడం చాలా గౌరవంగా ఉంది. కర్ణాటకకు చెందిన యోధురాలు 'బెలవాడీ మల్లమ్మ' పాత్ర పోషించడం నాకు దక్కిన గొప్ప అవకాశం. నేను ఇంతకు ముందు చేసిన చిత్రాలకు ఇది భిన్నమైనద"ని చెప్పింది. శివాజీ సైన్యంతో వీరోచితంగా పోరాడి, తిరుగులేని ధైర్య సాహసాలను చూపిన శక్తిమంతమైన వీరనారి మల్లమ్మ. సందీప్ సింగ్ దర్శకత్వంలో ముస్తాబవనున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు చేసుకుంటుంది. ఏడాది చివర్లో చిత్రీకరణ ప్రారంభం కానుందని సమాచారం.





# శ్రీదేవి చివరి మూవీ 'మామ్'ఔ సీక్వెల్‌లో ఖుషీ.. నవంబరులో రిలీజ్?

ప్రముఖ నటి శ్రీదేవి చివరి చిత్రం 'మామ్' ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసింది. ఇప్పుడు ఆ సినిమా సీక్వెల్‌తో ఆమె చిన్న కుమార్తె ఖుషీ కపూర్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'ది ఆర్చీస్' చిత్రంతో తెరంగేట్రం చేసిన ఖుషీ.. ఆ తర్వాత, 'నాదానియాన్', 'లవ్యాపా'వంటి చిత్రాల్లో నటించారు. కానీ అవి ఆశించిన విజయాలు సాధించలేదు. తాజాగా 'మామ్ 2'తో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. గిరీశ్ కోహ్లీ దర్శకత్వంలో, బోనీ కపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నోయిడా, గ్రీస్ ప్రాంతాల్లో అత్యంత భారీ స్థాయిలో చిత్రీకరించారు. ఈ ఏడాది నవంబరులో థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఖుషీ ప్రధాన పాత్రలో, జిషు సేన్‌గుప్తా, కరిష్మా తన్నా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఇక, రవి ఉద్యావార్ దర్శకత్వంలో 2017లో వచ్చిన 'మామ్' చిత్రం శ్రీదేవి సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఆఖరి చిత్రం. 2018 ఫిబ్రవరిలో ఆమె కన్నుమూసిన అనంతరం, ఈ చిత్రంలో ప్రదర్శించిన నటనకు ఉత్తమ నటి జాతీయ పురస్కారానికి లభించింది.



# క్యారవాన్‌లోకి వచ్చి చొక్కా విప్పేశాడు.. షూటింగ్ సెట్‌లో చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న కాజల్!



ప్రముఖ కథానాయిక కాజల్ అగర్వాల్ షూటింగ్ సెట్‌లో తనకు ఎదురైన ఒక భయంకరమైన సంఘటనను గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్ పూర్తయ్యాక తాను క్యారవాన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా, అదే చిత్రంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి ఎలాంటి అనుమతి తీసుకోకుండా, కనీసం తలుపు కూడా కొట్టకుండా లోపలికి వచ్చేశాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత అతడు వెంటనే తన చొక్కా విప్పి, ఛాతీపై ఉన్న కాజల్ పేరు టాటూను చూపించాడని, ఆ హఠాత్ పరిణామానికి తన కాళ్లు చేతులు వణికిపోయాయని కాజల్ వెల్లడించారు.

అభిమానంతో టాటూ వేయించుకోవడం సంతోషమే అయినా, ఒక మహిళ ఒంటరిగా ఉన్నప్పుడు అనుమతి లేకుండా క్యారవాన్‌లోకి రావడం ఏమాత్రం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంత పెద్ద అభిమాని అయినా ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించలేమని, ఇలాంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించి అతడిని అక్కడి నుంచి పంపించి వేసినట్లు కాజల్ చెప్పారు. 2004లో హిందీ చిత్రం 'క్యూన్! హో గయా నా'తో అరంగేట్రం చేసిన కాజల్, ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'మగధీర' చిత్రంతో స్టార్ హీరోయిన్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత డార్లింగ్, బృందావనం, మిస్టర్ పర్ఫెక్ట్, బిజినెస్‌మ్యాన్, నాయక్, బాద్‌షా, ఎవడు, టెంపర్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో అలరించడమే కాకుండా బాలీవుడ్‌లో 'సింగం', 'స్పెషల్ 26' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన ఇండియా స్టోరీ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# కట్నం తేలేదని.. ఆడపిల్లలు పుట్టారని దెబ్బలు తిని: ఆ 'స్వర్ణం' వెనక కష్టాలు ఇవీ!




మైదానం.. రింగ్ ఏదైనా సరే యువ తరంగాలే దేశానికి పతకాలు తేగలరనే మాటను చెరిపేశారు పారా అథ్లెట్ షర్మిలా ధన్‌ఖడ్. వయసు నంబర్ మాత్రమేనని నిరూపించారు. తనను ఓడిద్దామనకున్న పోలియోను జయించి.. గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణాన్ని కైవసం చేసుకున్నారు. 40 ఏళ్ల వయసులో షాట్‌పుట్ ఎఫ్57 ఫైనల్లో 9.81 మీటర్ల త్రో వేశారు. దాంతో కామన్వెల్త్‌లో పారా అథ్లెటిక్స్‌లో భారత రెండు దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. పోలియో.. వరకట్న వేధింపులు.. ఆర్థిక సమస్యలు.. దాటుకొని షర్మిల చేసిన గెలుపు ప్రయాణం చూద్దామా..!


హరియాణాలోని మహేంద్రగఢ్ జిల్లా చిత్రౌలికి చెందిన షర్మిల గ్లాస్గో వేదికగా భారత జెండాను రెపరెపలాడించారు. చిత్రౌలి నుంచి గ్లాస్గో వరకు ఆమె చేసిన ప్రయాణంలో కష్టాలు.. కన్నీళ్లే ఉన్నాయి. తండ్రి ఓ సన్నకారు రైతు. తల్లికి దృష్టి లోపం. నలుగురు సంతానంలో షర్మిల రెండో బిడ్డ. ఒకవైపు ఆర్థిక సమస్యలు.. మరోవైపు తగిన వైద్యసదుపాయాలు లేకవపోడంతో రెండేళ్ల వయసులో ఆమె పోలియో బారినడ్డారు. దాంతో ఎడమకాలు పూర్తిగా దెబ్బతింది. ఈ సమస్యతో బాధపడుతూనే.. పదో తరగతి పూర్తిచేస్తే, ఆ వెంటనే తల్లిదండ్రులు పెళ్లి చేశారు.

పెళ్లితో అనూహ్య మలుపు..

ఆ పెళ్లితో శారీరక సమస్యలకు తోడు మానసిక కష్టాలు జతయ్యాయి. షర్మిల భర్త మద్యం, మాదకద్రవ్యాల మత్తులో తూగేవాడు. కుటుంబ భారమంతా ఆమెనే మోయాల్సి వచ్చింది. అది చాలాదన్నట్టు కట్నం తీసుకురాలేదని కొట్టేవాడు. తర్వాత ఇద్దరు ఆడపిల్లలు పుట్టారన్న సాకుతో చావబాదేవాడు. చివరకు ఓ రోజు అతడు మరింత వికృతంగా ప్రవర్తించాడు. "అప్పుడు నా వయసు 26 ఏళ్లు. నా భర్త నన్ను కొట్టి.. దుస్తులు చింపేసి ఇరుగుపొరుగు వారి ముందు నిలబెట్టాడు. తర్వాత నా ఇద్దరు పిల్లలతో పాటు నన్ను ఇంటి నుంచి గెంటేశాడు" అని ఓ సందర్భంలో షర్మిల వెల్లడించారు. ఆ తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లి, బతకడానికి ఏ పని దొరికితే అది చేశారు. ఆ జీతం తనకు ఏమూలకు సరిపోకపోయినా.. పనిలో నిమగ్నమవడంతో తన మనసులోకి ఎలాంటి ప్రతికూల ఆలోచనలు వచ్చేవి కావని వివరించారు. ఆ తర్వాత ఆమె జీవితం అనూహ్య మలుపు తిరిగింది.

28 ఏళ్ల వయసులో ఆమె రెండో పెళ్లి చేసుకున్నారు. మునపటి జీవితానికి ఏమాత్రం పోలికే లేని కొత్త జీవితం ప్రారంభమైంది. భర్త అజిత్ సింగ్ తనలో స్ఫూర్తి నింపారని షర్మిల వెల్లడించారు. తనతో పాటు తన ఇద్దరు పిల్లల బాధ్యత తీసుకున్న ఆయన.. తమను రెవాడీకి తీసుకెళ్లిపోయారని చెప్పారు. అక్కడే ఆమెను పారా స్పోర్ట్స్‌లో చేర్పించారు. ఆ తర్వాత ఆమె షాట్‌పుట్‌లో ప్రావీణ్యం సంపాదించారు. అక్కడ మొదలుపెట్టిన ఆమె.. గ్లాస్గో వేదికగా షాట్‌పుట్ ఎఫ్57 ఫైనల్లో 9.81 మీటర్ల త్రో వేసి, ఈ సీజన్‌లో అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన చేశారు. రెండు దశాబ్దాల క్రితం 2006లో జరిగిన కామన్వెల్త్‌లో పారా అథ్లెట్ రంజిత్ కుమార్ జయశీలన్ డిస్కస్ త్రోలో రజతం సాధించారు. ఇక, షర్మిల సాధించిన విజయంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆమెను అభినందిస్తూ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు.

# మనోళ్లు దొరికిపోతున్నారు.. బౌండరీలు వెనక్కి జరపండి



స్వదేశంలో అదరగొట్టే భారత బ్యాటర్లు పెద్ద మైదానాలు ఉండే దేశాల్లో తడబడుతున్నారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఇది స్పష్టంగా కనిపించింది. చిన్న బౌండరీలకు అలవాటు పడిన మన బ్యాటర్లు.. పెద్ద బౌండరీలు ఉన్నగ్రౌండ్లలో భారీ షాట్లు ఆడి బౌండరీ లైన్ వద్ద ఫీల్డర్లకు చిక్కి పెవిలియన్ చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సునీల్ గవాస్కర్ బీసీసీఐకి కీలక సూచన చేశారు. కొత్త సీజన్‌లో మన మైదానాల్లో బౌండరీ లైన్లను వెనక్కి జరపాలన్నారు.

"ఐపీఎల్‌లో ఫ్లాట్ పిచ్‌లు, చిన్న బౌండరీలపై అదరగొట్టిన భారత బ్యాటర్లు ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో అలవాటు లేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడ్డారు. భారత్‌లో ఫ్లాట్ పిచ్‌లు ఉన్న మాట నిజమే. చాలా చిన్నగా ఉండే బౌండరీలే బ్యాటర్లకు అనుకూలిస్తాయి. దాంతో వారు సరిగ్గా షాట్ కొట్టని బంతులు కూడా బౌండరీ దాటుతున్నాయి. అదే పెద్ద, పొడవైన బౌండరీలు ఉన్న దేశాల్లో అవే షాట్లు ఆడి బౌండరీ లైన్ లోపలే ఫీల్డర్లకు చిక్కుతున్నారు. వచ్చే ఏడాది జరగబోయే ప్రపంచ కప్‌నకు ముందు మన బ్యాటర్లు అలవాటు పడేందుకు కొత్త సీజన్ ప్రారంభమయ్యే సమయానికి బౌండరీల దూరం పెంచడం అత్యంత ఆవశ్యకం. దాదాపు ప్రతి మైదానంలోనూ ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల వెనుక ప్రజలు నడవడానికి తగినంత ఖాళీ స్థలం ఉంటుంది. ఆ స్థలాన్ని వినియోగించుకుని బౌండరీల పరిమాణం పెంచాలి" అని గవాస్కర్ సూచించారు.

# అభిషేక్ శర్మ విషయంలో కఠిన నిర్ణయం అవసరం: క్రిస్ శ్రీకాంత్

టీవల జింబాబ్వేతో ముగిసిన మూడు టీ20ల సిరీస్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 11 పరుగులే చేశాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లో బ్లెస్సింగ్ ముజరబాని బౌలింగ్‌లోనే అభిషేక్ వెనుదిరిగాడు. అంతకు ముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో జరిగిన సిరీస్‌ల్లో అభిషేక్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అతను గత 10 ఇన్నింగ్స్‌ల్లో 191 పరుగులు మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మ ఫామ్‌పై మాజీ చీఫ్ సెలక్టర్ కృష్ణమాచారి స్పందించాడు. అభిషేక్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. సంజు శాంసన్ తిరిగి టీ20 జట్టులోకి వస్తాడని క్రిస్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

"టీ20 ప్రపంచ కప్ నుంచే ప్రత్యర్థులు అభిషేక్ శర్మ ఆట తీరును పసిగట్టేశారు. అతడిని ఎలా కట్టడి చేయాలో తెలుసుకున్నారు. ఇప్పుడు అభిషేక్ విషయంలో సెలక్టర్లు కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నాకనిపిస్తోంది. సంజు శాంసన్ కు కచ్చితంగా మళ్లీ అవకాశం లభిస్తుందని భావిస్తున్నాను" అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నాడు. జింబాబ్వేతో సిరీస్‌లో పునరాగమనం చేసిన పేసర్ మయాంక్ యాదవ్‌పై కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రశంసలు కురిపించాడు. 'మయాంక్ మూడు మ్యాచ్‌లు ఆడటం చాలా బాగుంది. అతని గురించి నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కుర్రాడు నిలకడగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. అతనికి భారత క్రికెట్‌లో చక్కటి భవిష్యత్తు ఉంది. అశోక్ శర్మ కూడా రాణిస్తున్నాడు. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు టీమ్ మేనేజ్‌మెంట్ అండగా నిలవాలి" అని మాజీ చీఫ్ సెలక్టర్ వివరించారు.




PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945